

కార్యకర్తలను మందలిస్తున్న మంత్రి పార్థసారథి

గ్రూపులను సహించం

వినకపోతే వెనక్కిపోతారు

టీడీపీ శ్రేణులకు మంత్రి కొలుసు హెచ్చరిక

నూజివీడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో గ్రూపు విభేదాలను సహించేది లేదని మంత్రి కొలుసు పార్థసారథి శ్రేణులను హెచ్చరించారు. రెండు గ్రూపులతో చర్చించి వివాదాలకు చెక్ పెట్టాలని మంత్రి భావించారు. చాట్రాయి మండలం పోలవరంలో మంగళ వారం రెండు వర్గాలను మంత్రి పిలిచారు. వారు ఒకే వేదికపైకి రాకపోవడంతో మంత్రి విడివిడిగా చర్చించి హెచ్చరికలు చేశారు. అధిష్ఠానం నిర్ణయాలను అతిక్ర మించి గ్రూపు రాజకీయాలు చేస్తే వారిపై చర్యలు తప్ప వని, వినకపోతే వెనక్కిపోతారని స్పష్టం చేశారు. నియో జకవర్గంలో కాంట్రాక్టులు, మట్టి తోలకం వ్యవహారాలు పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రస్తావించారు.

స్థానిక నాయకత్వం మార్పులు?

తెలుగుదేశం మహానాడుకు ముందే పార్టీ సంస్థాగత ఎన్నికలు జరగవలసి ఉంది. నియోజకవర్గంలో విభేదా లు సమసిపోవాలంటే గ్రామ, మండల స్థాయిల్లో పార్టీ నాయకత్వం మార్పు చేయాలని మంత్రి సారథి భావి స్తున్నట్లు తెలుస్తోంది. పోలవరం వేదికగా ఇరువర్గాలకు హెచ్చరికలు చేశారు. గ్రూపులతో పార్టీకి నష్టం జరిగితే సహించేది లేదని, అవసరమైతే మూడో వ్యక్తిని తీసుకువస్తానని చెప్పడం ద్వారా మంత్రి పార్టీ క్యాడర్‌కు గట్టి హెచ్చరిక జారీచేశారు. వార్డు నుంచి మండల స్థాయి పదవుల వరకు ఎవరెవరిని కొనసాగించాలి, ఎక్కడ కొత్తవారిని తేవాలనే విషయంపై మంత్రి నాయకులతో చర్చిస్తున్నట్లు సమాచారం.

మట్టి తగవుపై మండిపడిన మంత్రి

పోలవరంలో పలువురు కార్యకర్తలు మట్టి తోలకాలు మంత్రి దృష్టికి తెచ్చారు. అధికారులు దాడులు చేస్తు న్నారని తెలిపారు. మట్టి రవాణాపై కార్యకర్తలను మంత్రి మందలించారు. గ్రామాల్లో నివాస స్థలాలకు మట్టి తోలుకోడానికి అవకాశం ఇస్తే కొంతమంది దానికి భిన్నంగా వ్యవహరించారన్నారు. అధికారులకు ఫిర్యాదు అందడంతో చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. తనకు చెప్పింది ఒకటి, కొందరు చేస్తోంది మరొకటి అంటూ మంత్రి కార్యకర్తలకు చివాట్లు పెట్టారు.

రాజ్యసభకు ఉద్దండులు



- ఉమ్మడి పశ్చిమలో సీనియర్లకు ప్రాధాన్యం
- టీడీపీ నుంచి బీజేపీ వరకు ఇదే క్రమం
- తాజాగా పాకా ఎంపిక

ఏ పార్టీ అధికారంలో ఉన్న వీలు కుదిరినప్పుడల్లా ఉమ్మడి పశ్చిమ నుంచి రాజ్యసభ సభ్యులుగా రాజకీయ ఉద్దండులనే ఎంపిక చేసేవారు. దీర్ఘకాలికంగా రాజకీయాలకు ఆలవాలమైన ఉమ్మడి పశ్చిమలోని డెల్టా ప్రాంతానికి చెందిన వారే అల్లూరి సత్యనారాయణ నుంచి పాకా సత్యనారాయణ వరకు ఎంపికవుతూ వచ్చారు. రాజకీయాలే కాదు పదుగురిలో సేవకుడిగా, మచ్చ లేని నేతలుగా ఎదిగిన వారిని తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఎంపిక చేస్తూనే వచ్చారు. రాజకీయ అనుభవం, ముక్కుసూటితనం, అవినీతికి దూరంగా ఉన్న వారినే పెద్దల సభకు పంపారు. ఈ ఆనవాయితీనే భారతీయ జనతా పార్టీ అందిపుచ్చుకుంది. నాలుగు దశాబ్దాలు సుదీర్ఘ సేవలందించిన వివాదరహిత నేత భీమవరం పట్టణానికి చెందిన పాకాను రాజ్యసభకు ఎంపిక చేశారు. రాజ్యసభకు ఎంపిక, ఎన్నికైనవారంతా జిల్లా ప్రతిష్ఠను మరింత పెంచడానికే ప్రయత్నించారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

నాటి నుంచి నేటి వరకు..

1970-80 మధ్య నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వారు రాజ్యసభ సభ్యులుగా ఎంపికవుతూ వచ్చారు. పాలకొల్లు ప్రాంతానికి చెందిన అల్లూరి సుభాష్ చంద్రబోస్ తండ్రి అల్లూరి సత్యనారాయణ సైతం 80వ దశకం ముందే రాజ్యసభ ఎంపికయ్యారు. అప్పట్లో ఈ ప్రాంతానికే కాక రాష్ట్రస్థాయిలో రాజకీయ ప్రాచుర్యం పొందిన కుటుంబాల నుంచే పెద్దల సభకు ఎంపిక చేసేవారు. కుటుంబ నేపథ్యమే కాకుండా రాజకీయాలు, సేవాతత్పరత, కలుపుగోలుతనం, అంతర్గత క్రమశిక్షణకు నూటికి నూరుశాతం బద్దులైన వారి నుంచే రాజ్యసభకు ఎంపికచేసి పంపేవారు. 80వ దశకం ముందు కాంగ్రెస్ హవా కొనసాగింది. అప్పట్లో ఆ పార్టీ సైతం నిష్ణాతులైన అల్లూరి సత్యనారాయణ వంటి వారిని ఎంపిక చేసినట్టు చెబుతారు. తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో తెలుగుదేశం దూసుకొచ్చింది. అప్పట్లో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు సైతం పార్టీకి అత్యధిక సేవలందించిన వారిని రాజ్యసభకు ఎంపిక చేస్తూ వచ్చారు. ఆనాటి రాజకీయాల్లో తనకు చేదోడువాదోడుగా ఉన్న వారిని ఎన్టీఆర్ గుర్తించే ప్రయత్నం చేశారు. పార్టీ వ్యవహారాలు చురుగ్గా నడిపేవారిని, గండిపేట కేంద్రంగా పార్టీ వ్యవహారాలను చక్కబెట్టడంలో కీలకపాత్ర వహించిన వారిలో ఒకరైన భీమవరం ప్రాంతానికి చెందిన మెంటే పద్మనాభంను రాజ్యసభకు ఎంపిక చేశారు. 1989 నుంచి 1994 వరకు మెంటే పద్మనాభం పెద్దల సభలో కొనసాగారు. భీమవరం ప్రాంతానికి చెందిన నేతగా ఆయన ఢిల్లీ వ్యవహారాల్లో అప్పట్లో అడుగుపెట్టారు. ఆనాడు ఉన్న పరిస్థితులను బట్టి ఎంపీగా ఢిల్లీ వెళ్లడమే ఒక అరుదైన ప్రస్థానం. అప్పటి నుంచే మెంటే పద్మనాభం ఎన్టీఆర్‌కు మరింత సాన్నిహిత్యంగా పలు రాజకీయ సూచనలు చేసేవారని చెబుతారు. మెంటేతో ఆరంభమైన రాజకీయ ప్రస్థానం ఇప్పటి వరకు సాగుతూనే ఉంది. మెంటే అనంతరం ఉమ్మడి పశ్చిమలో రాజకీయ వ్యూహకర్త సీనియర్ అనేక పదవులను విజయవంతంగా నిర్వహించిన యర్రా నారాయణస్వామిని టీడీపీ మరోసారి రాజ్యసభకు పంపింది. ఎంపీగా ఆయన 1994 నుంచి 1999 వరకు కొనసాగారు. ఆయన డెల్టా రాజకీయ వ్యవహారాల్లోనే కాకుండా ఉమ్మడి పశ్చిమలో వివాద రహితుడిగా ఉన్న నారాయణస్వామి రాజ్యసభలోనే గళం విప్పారు. తాగు, సాగు, వ్యవసాయం వంటి అం శాలను సభలో ప్రస్తావించారు. టీడీపీ పక్షాన అంశాలను లేవనె త్తడంలో నారాయణ స్వామికి ఒక గుర్తింపు కూడా వచ్చింది

ఇప్పుడు బీజేపీ వంతు

తెలుగుదేశం మాదిరిగానే బీజేపీ కూడా ఉమ్మడి పశ్చిమలో అటు రాజ్యసభ, ఇటు లోక్‌సభ స్థానాల్లోను తమ పార్టీకి చెందిన వారికే ప్రాధాన్యం ఇచ్చేలా జాగ్రత్తలు తీసుకుంది. నరసాపురం ప్రాంతానికి చెందిన నిర్మల సీతారామన్‌కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ సభ్యురాలిగా అవకాశం ఇచ్చింది. ఇప్పుడు మరోమారు భీమవరం పట్టణానికి చెందిన పాకా వెంకట సత్యనారాయణను రాజ్యసభకు ఎంపిక చేయడం ద్వారా కీలక నిర్ణయం తీసుకుంది. ఇంతకుముందు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నరసాపురం నుంచి ఎన్నికైన భూపతిరాజు శ్రీనివాసవర్మను కేంద్రమంత్రిగా తీసుకుని ఈ ప్రాం తంలో బీజేపీకి మరింత ఊపిరి పోసే నిర్ణయం తీసుకుంది. గతంలో కృష్ణంరాజు నరసాపురం నుంచి ఎన్నికై కేంద్రమంత్రిగా రాణించారు.

టీడీపీ నుంచే అత్యధికులు

ఉమ్మడి పశ్చిమ నుంచి రాజ్యసభకు అభ్యర్థులను ఎంపిక చేసి పంపడంలో తెలుగుదేశందే అందెవేసిన చేయి. మెంటే పద్మనాభం వంటి ఉద్దండులకు అవకాశం ఇచ్చినట్లే పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలను కీలక సమయంలో మోసిన నారాయణ స్వామి బంధువు భీమవరానికి చెందిన తోట సీతారామలక్ష్మి 2014 - 2020 వరకు రాజ్యసభ సభ్యురాలిగా వ్యవహరించారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న చంద్రబాబు నాయుడు సామాజిక అంశాలతో పాటు ఉమ్మడి పశ్చిమకు ప్రాధాన్యత ఇచ్చేలా సీతారామలక్ష్మిని రాజ్యసభకు ఎంపిక చేయడం విశేషం. సీతారామలక్ష్మి కూడా రాజ్యసభలో పలు అంశాలను ప్రస్తావనకు తీసుకొచ్చారు. ప్రత్యేకించి టీడీపీ ఢిల్లీ వ్యవహారాల్లో ఆమె చురుగ్గా పాలుపంచుకున్నారు. 1980- 2020 వరకు టీడీపీ వీలుచిక్కినప్పుడల్లా ఉమ్మడి పశ్చిమే రాజ్యసభ కోటా ఇచ్చేలా ప్రయత్నించింది.

అట్టహాసంగా 'పాకా' నామినేషన్

భీమవరం టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అభిమానుల కేరింతలు.. బాణసంచా కాల్పులు.. తీన్మార్ డప్పుల మోత మధ్య రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేయడానికి బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ మంగళవారం అమరా వతి తరలివెళ్లారు. రాజ్యసభ అభ్యర్థిగా ఆయన ఎంపికతో అభిమానులు పెద్ద ఎత్తున నివాసానికి తరలివెళ్లారు. పూలదండలు బొకేలతో అభినందించారు.

అమ్మవారికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న పాకా కుటుంబ సభ్యులు

పాకా వెంకట సత్య నారాయణ భార్య, కుమార్తెతో కలిసి మంగళ వారం ఉదయం బలుసు మూడి మావుళ్లమ్మ, శ్రీరాంపురం కనకదుర్గ ఆలయంలో నామినేషన్ పత్రాలకు ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేసిన బీజేపీ అధిష్ఠానానికి, కూటమికి కృతజ్ఞతలు తెలిపారు. అక్కడి నుంచి నామినేషన్ వేయడానికి అమరావతి బయలుదేరి వెళ్లారు. పెద్ద సంఖ్యలో అభిమానులు, నాయకులు అమరావతి బయలుదేరారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవికుమార్, అసెంబ్లీ కన్వీనర్ కాయిత సురేంద్ర, అల్లూరు వెంకటేశ్వ రరాజు, బీసీ సంఘాల నాయకులు నారాయణ, నాగరాజు, వెంకటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో ఉన్నారు.

సీఎం చంద్రబాబును కలిసి..



అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కుటుంబ సభ్యులతో కలిసి పాకా సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యేలు కామి నేని శ్రీనివాసరావు, ఈశ్వరరావు, పార్థసారథి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, నేతలు ఉన్నారు.

పాకాను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు చంటి, రోషన్, ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

ఎన్డీఏ హయాంలోనే

అమరావతి అభివృద్ధి

2న మోదీ సభను విజయవంతం చేయండి : మంత్రుల పిలుపు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్ర జ్యోతి): ఎన్డీఏ హయాంలో రాజధాని అమరా వతి అభివృద్ధి చెందుతుందని, మే 2న ప్రధాని నరేంద్రమోదీ పలు అభివృద్ధి పనుల కు శ్రీకారం చుడతారని రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రధాని సభను కూటమి శ్రేణులు విజయవంతం చేయాలని వారు పిలుపుని చ్చారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో మంగళ వారం విలేకరుల సమావేశంలో వారు మాట్లా డారు. రాజధాని నిర్మాణానికి రైతులు, ప్రజలు 34 వేల ఎకరాలు నాటి తెలుగుదేశం ప్రభు త్వానికి అప్పగించారన్నారు. అనంతరం అధి కారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూర్ఖం గా రాజధాని అమరావతిని నిర్లక్ష్యం చేసింద న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రధాని మోదీని రాజధాని పనులు పునఃప్రా రంభించేందుకు రావాలని కోరారన్నారు. మోదీ సభను విజయవంతం చేయడానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కృషి చేయాలన్నారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

అంతకుముందు టీడీపీ జిల్లా కార్యాలయం లో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో సమావేశమై కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశా రు. అమరావతి రాజధాని నిర్మాణం రాష్ట్రానికి ఎంత అవసరమో మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలకు వివరించారు. ప్రధాని విజయ వంతం చేయాలని నేతలు, కార్యకర్తలను ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చింత మనేని ప్రభాకర్, బడేటి చంటి, సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మే యర్ షేక్ నూర్జహాన్, మాజీ ఎమ్మెల్యే ఘం టా మురళి, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసు లు, దాసరి శ్యాం సుందర్ శేషు, దాసరి ఆం జనేయులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.గోవిందరావు, ఘంటా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



వేలేరుపాడులో చెట్లు విరిగిపడడంతో నేలకూలిన పూరిల్లు



కుక్కునూరులో కురిసిన భారీ వర్షం

గాలి వాన

గాలుల ఉధృతికి విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

పలు గ్రామాల్లో నిలిచిన విద్యుత్ సరఫరా

వేలేరుపాడు/కుక్కునూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులుతో భారీ వర్షం కురిసింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగి పడడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. విరిగి పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు రహదారులపై పడి ఉన్నాయి. కొన్ని ఇళ్లు ధ్వంసం కాగా రహదారులపై రాక పోకలు స్తంభించాయి. వేలేరుపాడు మండలం బుర్ర తోగు, భూదేవిపేట, శివకాశీపురం, తదితర గ్రామాల్లో ఆస్తినష్టం జరిగింది. విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. సరఫరా పునరుద్ధ రించడానికి చాలా సమయం పడుతుందని ప్రస్తుతం రోడ్లపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు, వైర్లు తప్పించే పనిలో ఉన్నామని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. బుర్రతోగు గ్రామంలో పలు ఇళ్లు ధ్వంసమ య్యాయి. కుక్కునూరు మండలంలో భారీ వర్షం కురి సింది. గాలి ఉధృతికి పలుచోట్ల కొమ్మలు విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది.



బుర్రతోగులో విరిగిపడిన స్తంభం

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

వేసవి కాలం గ్రామాల్లో మంచినీటి సమస్యలు, రక్షిత మంచినీటి పథకాల నుంచి స్వచ్ఛమైన నీరు సరఫరా, నిర్వహణ, మంచినీటి చెరువుల్లో నీరు.. తదితర అంశాలపై బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనుంది. ప్రజలు

91001 21200

నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపితే పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జి.త్రినాథ్‌బాబు చర్యలు తీసుకుంటారు.

చేపలకు కోళ్ల వ్యర్థాలు

యథేచ్ఛగా రవాణా

కొరవడిన నిఘా

రైతులకు అవగాహన లేమి

కైకలూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగాన్ని కొంతమంది స్వార్థపరులు సంక్షోభంలోనికి నెట్టివేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధిం చాలని చేపలకు కోళ్ల వ్యర్థాలను మేతగా వేస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు, చేప ల రైతుల సంఘం అవగాహన కార్యక్ర మాలు నిర్వహించినా కొంతమంది ఫంగస్ జాతి చేపలకు కోళ్ల వ్యర్థాలను వినియో గిస్తున్నారు. ఆ వ్యర్థాలతో పెరిగిన చేపలు తిన్నవారు అనారోగ్యాని గురవుతున్నట్లు కొన్ని పరిశోధనల్లో తేలింది.



చేపల చెరువులో వేసిన వ్యర్థాలు

ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లా ల్లో సుమారు 60వేల ఎకరాల్లో ఫంగస్ చేప సాగు చేస్తున్నారు. హైదరాబాద్, తది తర పట్టణాల నుంచి వాహనాలలో కోళ్ల వ్యర్థాలను రాత్రివేళ గుట్టుగా తరలిస్తున్నా రు. కైకలూరు మండలం చటాకాయ్ గ్రామంలో ఇటీవల 10 ఎకరాల ఫంగస్ జాతి చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలను మేతగా వేశారు. ఇటీవల విజయవాడ, మచిలీపట్నం ప్రాంతాల్లో కుళ్లిన కోడిగుడ్లు, కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు. చటాకాయ్‌లో ఫంగస్‌జాతి చేపల పెంపకం ఎక్కువగా ఉండడంతో చాలామంది వ్యర్థాలను మేత గా వేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కైక లూరు రూరల్ పోలీసులు ఒక లారీ డ్రైవర్ ను రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ కేసు నమోదు చేశారు. గతంలో కొల్లేరు గ్రామా ల్లోనే వ్యర్థాలు వినియోగించడంతో కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ రైతుల తీరు మారకపోవడంతో వ్యర్థాలు యథే చ్ఛగా రవాణా అవుతున్నాయి.

సరిహద్దులో కొరవడిన నిఘా

కూటమి ప్రభుత్వం కోళ్ల వ్యర్థాలను రవాణా నిరోధానికి సరిహద్దుల్లో నిఘా ఉంచింది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో పోలీ సు, మత్స్యశాఖ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. రాష్ట్ర సరిహద్దుల్లో సరైన నిఘా లేకపోవడంతో రవాణా జరుగుతోంది. కొన్నిచోట్ల చెక్‌పోస్ట్ సిబ్బందికి మామూళ్లు ముట్టజెప్పి వ్యర్థాలను తరలి స్తున్నారు. కోళ్ల వ్యర్థాల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాటిని నియంత్రించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



అటవీ అధికారులతో మట్లాడుతున్న నాయకులు

కొల్లేరులో మళ్లీ అదే సీన్

అడవికొలనులో చెరువుకు గండి కొట్టేందుకు అధికారుల ప్రయత్నం

అడ్డుకున్న స్థానిక రైతులు

395 కేజీల గంజాయి స్వాధీనం

ఐదుగురి అరెస్టు.. వ్యాన్, కారు సీజ్

లోపలి పేజీల్లో



అమరావతిలో కృష్ణా నది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయం

సాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ సర్వసభ్య సమావేశం

- లోపలి పేజీలో



మంగళవారం నూజివీడులో జరిగిన ప్రాజెక్టు కమిటీ సమావేశంలో సభ్యులు

అమరావతిలో కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు

నూజివీడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయటానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు కాంపిటెంట్ అథారిటీ సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ ఎమ్మార్ మోహిద్దీన్ తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా సాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం నూజివీడులోని ఎడమకాలువ డివిజన్ కార్యాలయంలో కమిటీ చైర్మన్ కోట వీరబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎస్ఈ మోహిద్దీన్ మాట్లాడుతూ ఎడమ కాలువ పరిధిలో 2వ, 3వ జోన్‌లో కాలువల నిర్వహణకు అంచనాలు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళామని తెలిపారు. ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎడమకాలువ మూడోజోన్‌లోని 2.36 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ద్వారా గోదావరి జలాలను తీసుకువచ్చే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎడమకాలువకు 32 టీఎంసీలు అధికార వాటా ఉన్నప్పటికి ఈ సీజన్‌లో 20 టీఎంసీలు మాత్రమే సాగునీరు తెలంగాణ నుంచి మనకు అందిందన్నారు. మూడోజోన్ పరిధిలో బాపులపాడు మేజర్, వేంపాడు మేజర్, మాచవరం మేజర్, జక్కంపూడి మేజర్, జమలాపురం మేజర్, మూలపాడు, ఇబ్రహీంపట్నం మేజర్‌లకు కనీసం సాగునీరు అందలేదన్నారు. 16వ ఆర్థికసంఘం నుంచి ఎడమ కాలువల ఆధునికీకరణకు ప్రతిపాదించిన రూ.199 కోట్ల నిధులను మంజూరు చేయించాలని కోరారు.

కమిటీ చైర్మన్ కోటా వీరబాబు మాట్లాడుతూ ఎడమకాలువ తాగు నీటి కోసం ప్రతిపాదించిన 3.75 టీఎంసీల నీటిని విడుదల చేయాలని, 2వ జోన్ సాగర్ ఎడమ కాలువ స్థిరీకరణకు ఉపయోగపడే వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాన్ని త్వరగా ప్రారంభించాలన్నారు. జోన్-2 పరిధిలో ఎత్తిపోతల పథకం ద్వారా చివరి ఆయకట్టు స్థిరీకరణకు పాములూరు, వెంకటాపురం బ్యారేజ్‌ను త్వరగా నిర్మించాలని కోరారు. పలువురు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు మాట్లాడుతూ ప్రాజెక్టు కమిటీ పరిధిలోని డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో అనధికార ఆక్రమణలను తొలగించాల కోరారు. 117వ కిలోమీటర్ రామచంద్రాపురం రెగ్యులేటర్ దగ్గర గేట్లను, మొద్దులపర్వ రెగ్యులేటర్ దగ్గర నూజివీడు, మైలవరం బ్రాంచ్ కాలువల గేట్లను పూర్తిస్థాయిలో మరమ్మ తులు చేయించాలని కోరారు. గత ప్రాజెక్టు కమిటీ తీర్మానంలో చేసిన తీర్మానాల అమలు నివేదికను ఈ సమావేశంలో ఆమోదించారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన 15 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, నూజి వీడు డివిజన్ ఈఈ అర్.సంతోష్, జగ్గయ్య పేట డీఈ కె.కిషోర్, ఇతర అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

మా సమస్యలు పరిష్కరించండి

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరవధిక సమ్మె

ఏలూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : తమకు రావాల్సిన ఎనిమిది నెలల పెండింగ్ ఇన్సెంటివ్‌లతో పాటు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. కేంద్ర ఏలూరు కలెక్టర్ వద్ద రెండోరోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు సొంగా సిద్దయ్య మాట్లాడుతూ 2018లో కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్లుగా విధుల్లో చేరిన తాము జిల్లా వ్యాప్తంగా 481 మంది పనిచేస్తున్నామని, తమకు 25 వేల రూపాయలు జీతంతో పాటు 15 వేల రూపాయలు పని ఆధారంగా ఇన్సెంటివ్‌లు ఇస్తున్నారని, అయితే ఎనిమిది నెలలుగా ఇన్సెంటివ్ నిలుపుదల చేశారన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, నిలుపుదల చేసిన పీఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం గత 15వ తేదీ నుంచి వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో గత్యంతరం లేక నిరవధిక సమ్మె చేపట్టామన్నారు. జిల్లా కార్యదర్శి సురేంద్ర, చాందిని, విమల కుమారి, సులోచన, సజ్జన్‌కుమార్, రవితేజ, వినయ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ముంపు నుంచి మోక్షం కలిగేనా ?



దువ్వలో వయ్యేరు గట్టున నిర్మాణ పనులు

ఎర్రకాలువపై ఇన్‌లెట్, అవుట్‌లెట్‌ల నిర్మాణాలు

వరద కట్టడికి ప్రభుత్వం చర్యలు
ఏటా వర్షాల సమయంలో పంట పొలాలు మునక
నిర్మాణాలు పూర్తయితే ఖరీఫ్ సేఫ్

తణుకు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రకాలువ పరీవాహక ప్రాంత రైతులు చిరకాల కోరిక ఎర్రకాలువ గట్లకు పంట భూముల నుంచి మురుగునీరు పారుదల కోసం ఏర్పాటు చేసిన అవుట్ లెట్, ఇన్‌లెట్‌లు పునర్నిర్మాణం ఈ ఏడాది పూర్తవుతుందా? అనే సంశయం రైతుల్లో నెలకొంది. జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లోని భారీ వర్షాల కారణంగా ఏర్పడిన మురుగునీటిని ఎర్రకాలువ ద్వారా తణుకు, అత్తిలి మండలంలో దువ్వ వయ్యేరు ద్వారా, ఉండి, భీమవరం ప్రాంతాల్లో యనమదుర్రు డ్రెయిన్ నుంచి చివరకు ఉప్పుటేరులో కలుస్తుంది. ప్రతీ ఏటా జూలై, ఆగష్టు, సెప్టెంబరు నెలలో ఎగువప్రాంతాల్లో కురిసే భారీ వర్షాల కారణంగా వివిధ జలాశయాల్లోకి చేరిన మురుగునీరు ఎర్రకాలువలో దిగువ ప్రాంతాల్లో వరదగా మారుతుంది. దీనివల్ల జిల్లాలోని పలు మండలాల్లోని పంట పొలాలు ముంపునకు గురై పంటలు మునిగిపోయి రైతులు నష్టపోతున్నారు. ప్రతీ ఏటా జరిగే ఈ నష్టాన్ని తగ్గించాలని ఎర్రకాలువ పరీవాహక ప్రాంత రైతులు కోరుతున్నారు. ఈ సంవత్సరం ఎర్రకాలువ వరదకు కట్టడి వేయాలని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

వరద ముంపే ఎక్కువ

ఎర్రకాలువ మురుగునీటి ప్రవాహానికి ఉద్దేశించిన కాలువ. కాలువ ప్రవహించినంత మేర పంట పొలాల్లోని భారీ వర్షాల కారణంగా పెరిపోయే మురుగునీటిని ఎర్ర కాలువలోకి వచ్చేలా నిడదవోలు మండలం నందమూరు నుంచి భీమవరం వరకూ అనేక గ్రామాల్లో ఇన్‌లెట్, అవుట్ లెట్‌ల కాంక్రీట్ నిర్మాణాలు చేశారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరడంతో ఎర్రకాలు వరద నీరు ఈ ఇన్‌లెట్, అవుట్‌ల ద్వారా నేరుగా మురుగు కాలువల్లోకి వచ్చి పంట పొలాలను ముంచేస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట్లో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన మురుగు నీటిని ఎర్రకాలువలోకి చేరేందుకు ఉద్దేశించిన ఈ ఇన్‌లెట్ అవుట్ లెట్‌లు ఎర్రకాలువ వరద ప్రవాహం ద్వారా పంటలు మునిగి పోవడానికి ఈ ఇన్‌లెట్ అవుట్‌లెట్‌లు దోహదం చేస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

50 చోట్ల ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లు

ఎర్రకాలువ జిల్లా మధ్యగా ప్రవహించడంతో రెండు గట్లకు సుమారు 50 చోట్ల ఈ ఇన్‌లెట్, అవుట్ లెట్‌లను నిర్మించారు. మొదట్లో ఇవి పొలాల్లోని మురుగునీని కాలువలోకి వచ్చేలా పని చేసినా కాలక్రమంలో ప్రసుతం ఇవి శిథిలావస్థకు చేరడం, గ్రామాల్లోని మురుగు కాలువలు ఆక్రమణలకు గురికావడంతో ఈ మురుగు కాలువలే వరదకు ప్రధాన కారణంగా నిలిస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఎర్రకాలువకు తూర్పు కాలువ గట్టు తణుకు ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో, పశ్చిమ గట్టు తాడేపల్లిగూడెం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో వున్నాయి. తూర్పు గట్టున సుమారు 30 ఇన్‌లెట్, అవుట్ లెట్‌లు, పశ్చిమ వైపు సుమారు 28 ఇన్‌లెట్, అవుట్ లెట్ నిర్మాణాలు వున్నాయి. ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరడం, తలపులు పూర్తిగా పాడై పోవడం వల్ల కాలువలో ప్రవహించే వరద నీరు వీటి ద్వారా మురుగు కాలువల్లోకి చేరి పంటలను ముంచుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. రైతులు వర్షాకాలంలో ఎర్ర కాలువ వరద నీరు పొలాల్లోకి రాకుండా ఇసుక బస్తాలతో కట్టడి చేస్తున్నా వరద నియంత్రణలోకి రాకపోవడంతో పొలాలు వరద నీటిలో మునిగిపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

పశ్చిమ వైపున ఏడు ఇన్‌లెట్, అవుట్ లెట్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఎర్రకాలువ పశ్చిమ గట్టు (కుడి గట్టు)న వున్న ఆరుళ్ల, కోనాల, ముద్దాపురం గ్రామాల పరిధిలో శిథిలమైన 7 అవుట్ లెట్, ఇన్‌లెట్‌ల నిర్మాణానికి సంబంధిత అధికారులు ప్రభుత్వాన్నికి ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ వద్ద వున్న ఈ ప్రతిపాదనలు ఆమోదం పొందితే టెండర్ల ప్రకియ పూర్తి చేసుకుని పనులు ప్రారంభిచేందుకు వీలవుతుంది. ఈ పనులు ఈ నెలలో పూర్తయితే మే నెలలో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వీలవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ అనుమతులు, టెండర్లు ప్రక్రియలు త్వరగా చేపడితే వేసవి కాలంలో నిర్మాణ పనులు చేపట్టి వర్షాకాలంలో వరదలను కట్టడి చేయడం ద్వారా పంటలను కాపాడవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

• ఈ ఖరీఫ్ లోపు నిర్మాణాలు పూర్తిచేయాలి

ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి ఎర్రకాలువ కుడి గట్టున వున్న అవుట్ లెట్, ఇన్‌లెట్ నిర్మాణాలు చేపడితే ఈ వచ్చే ఖరీఫ్ కాలంలో వచ్చే వరదల నుంచి పంటలను కాపాడుకునే వీలుంది. ఆరుళ్ల, కోనాల, ముద్దాపురం గ్రామాల పరిధిలో వున్న వీటిని పునర్నిర్మాణం చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించారు. మిగిలిన అనుమతులు కూడా త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నాం.

-ముళ్లపూడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, ముద్దాపురం.

• మురుగు కాలువల ఆక్రమణలు తొలగించాలి

ఎర్రకాలువ వరదకు ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లతో పాటు గ్రామాల్లోని మురుగు కాలువల ఆక్రమణలు కూడా పెరిగిపోవడం కూడా కారణం. అధికారులు ఎర్రకాలువ గట్లపై శిథిలావస్థలో వున్న ఇన్‌లెట్, అవుట్ లెట్‌లను పునర్నిర్మాణం చేయడంతో పాటు గ్రామాల్లోని మురుగు నీటి కాలువలను సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలి. మురుగు నీటి కాలువలను ప్రక్షాళన చేయడం ద్వారా వరద నష్టం తగ్గడంతో పాటు భారీ వర్షాల కారణంగా పేరుకుపోయే మురుగునీటి నష్టాలు కూడా తగ్గుతాయి.

-యర్రంశెట్టి భాస్కరరావు, రైతు వరిగేడు,

• ఏడు పనులకు ప్రతిపాదనలు

ఎర్రకాలువ కుడి గట్టున ఆరుళ్ల, కోనాల, ముద్దాపురం గ్రామాల పరిదిలో శిథిలావస్థకు చేరిన ఏడు ఇన్‌లెట్, అవుట్ లెట్ నిర్మా ణాలకు ప్రతిపాదనలు పంపించాం. ఆర్థిక శాఖ అనుమతులు, నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులు చేపడతాం.

-కిరణ్, ఇరిగేషన్ ఏఈ, తాడేపల్లిగూడెం

• ఎడమ గట్టున రెండు పనులు ప్రారంభం

ఎర్రకాలువ ఎడమ గుట్టున ఉన్న 2 ఇన్ లెట్, అవుట్ లెట్‌ల పునర్ని ర్మాణానికి రూ.70 లక్షలను ప్రభుత్వం తాజాగా మంజూరు చేసింది. దీంతో దువ్వ గ్రామం పరిధిలో రెండు ప్రాంతాల్లో నిర్మాణ పనులను ఇటీవల ప్రారంభించారు.

-హరికిషన్, ఇరిగేషన్ ఏఈ తణుకు



ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిని సందర్శించి దివ్యాంగునికి కృత్రిమ అవయవం అందిస్తున్న ఎక్సైజ్ డీఎస్పీ పాండురంగారావు

విర్డ్ ఆసుపత్రి అన్నదానానికి రూ. లక్ష విరాళం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిని ఎక్సైజ్, ప్రొహిబిషన్ డీఎస్పీ పాండు రంగారావు మంగళవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఆసుపత్రి అన్నదాన ట్రస్ట్‌కు రూ. లక్ష విరాళం అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 10 మంది దివ్యాంగులకు కాలిపర్స్, కృత్రిమ అవయవాలను అందించారు. ఆసుపత్రి చైర్మన్ సుధాకర రావు, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారీ, నాగేంద్రబాబు పాల్గొన్నారు.



చెరువులు తవ్వి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న టీడీపీ నాయకులు

వక్ఫ్ భూముల్లోని మట్టి అమ్మేస్తున్నారు..

టీడీపీ నాయకుల ఆందోళన

మొగల్తూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పంచాయతీ పరిధి జాతీయ రహదారిని అనుకుని ఉన్న వక్ఫ్ భూములు ఆక్వా సాగు పేరుతో తవ్వేస్తున్నారని వచ్చిన మట్టిని లక్షలాది రూపాయలకు అమ్మేసుకుంటున్నారని టీడీపీ నాయకులు ఆందోళన చేశారు. మొగల్తూరు అధ్యక్షుడు బొల్లా చంటి, మత్యకార సొసైటీ అధ్యక్షుడు మోకా ఏడుకొండలు తదితరులు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మొగల్తూరు జాతీయ రహదారిని అనుకుని ఉన్న వక్ఫ్ భూములు గత ప్రభుత్వంలో ఆక్వా సాగుకోసం లీజుకు తీసుకున్నారన్నారు. ఈ భూముల్లో చెరువులు తవ్వే క్రమంలో రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని లారీలతో విక్రయిస్తున్నారన్నారు. జాతీయ రహదారి వెంబడి భారీ లోతుతో ఆక్వా చెరువులు తవ్వుతున్నారని దీంతో పలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఆ భూములను ఆక్వా చెరువులుగా మార్చవద్దని టీడీపీ నాయకులు బళ్ళ శ్రీను, కవురు నాగేశ్వరరావు, డొల్లా రత్నంరాజు, పాము శ్రీధర్, కొల్లాటి బోగరాజు తదితరులు ఇసుక అక్రమ తరలింపు లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు.

భారత్ జట్టులో స్థానం సంపాదిస్తా

ఫిట్‌నెస్ క్యాంపులో కబడ్డీ క్రీడాకారిణి గౌరి



తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కబడ్డీ పోటీల్లో తలపడేందుకు భారత్ తరపున ఎంపిక చేసిన ప్రాథమిక జట్టులో తాడేపల్లిగూడెం పోస్టల్ ఉద్యోగిని కొప్పాన గౌరి చోటు దక్కించుకున్నారు. గుజరాత్‌లో 15 రోజులపాటు జరిగే ఫిట్‌నెస్ క్యాంపులో ఉన్నారు. ఇందులో అర్హత సాధిస్తే వచ్చే జూన్ నెలలో బీహార్‌లో జరిగే ప్రపంచ కప్ కబడ్డీ పోటీల్లో ఆమె దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. విశాఖ జిల్లా ఎండాడకు చెందిన గౌరి స్పోర్ట్స్ కోటాలో పోస్టల్ అసిస్టెంట్‌గా పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో పనిచేస్తున్నారు. ఇప్పటివరకు ఆమె అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. తాను ఫిట్ నెస్ నిరూపించుకుని భారత తరపున తుది జట్టులో స్థానం సంపాదిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కబడ్డీలో దేశం గర్వించే స్థాయికి ఎదగాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

కల్లు సీజన్

వేసవిలో భలే డిమాండ్

ఔషధ గుణాలు ఉన్నాయంటున్న వైద్య నిపుణులు
కొన్ని వ్యాధులకు ఇది మందు
గీత కార్మికులకు ఉపాధి

వేసవికాలం తాటికల్లుకు మంచి సీజన్.. ఈ రోజుల్లో గ్రామాల్లో చాలామంది కల్లు సేవించడం చూస్తుంటాం. తాటిచెట్టు నుంచి కుండలోకి వచ్చే ద్రావణాన్ని నీరా అంటారు.ఇది రుచిగా ఉండడమే కాకుండా పలు రకాల ఆరోగ్య సమస్యలను కూడా తగ్గిస్తుంది. దీన్ని చెట్టు నుంచి తీసిన 12 గంటల్లోపే తీసుకోవాలి..లేదంటే విషంగా మారుతుంది. కల్లుగీత కార్మికులకు వేసవిలో ఇదే పెద్ద ఉపాధి మార్గం.



గణపవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఒడిలో లభించే అమృతతుల్యం తాటికల్లు. ప్రాచీనకాలం నుంచి తాటికల్లు ప్రజలు గ్రామీణ ప్రాంతంలో అధికంగా తాగుతుంటారు. ఈ వేసవిలో చలువ చేస్తుందని తాటికల్లు ప్రియులు క్రమం తప్పకుండా సేవిస్తారు. ముఖ్యంగా రైతన్నలు తమ శ్రమను మరచిపోవడానికి సురాపానంగా భావిస్తుంటారు. ఉదయం, సాయంత్రం కల్లును చెట్ల నుంచి తీస్తుంటారు. ఉదయం తీసిన కల్లు మంచిదని భావిస్తారు.

గీత కార్మికులకు జీవనోపాధి

తాటికల్లు విక్రయాలు చేస్తూ వేలాది మంది గీత కార్మిక కుటంబాలు జీవనోపాధి పొందుతున్నారు. ఈ సీజన్ మూడు నెలలు వారికి మంచి ఉపాధి . వేసవి కాలంలో ఈ కల్లుకు మంచి డిమాండ్ ఉంటుంది. రైతుల నుంచి తాటిచెట్లను తీసుకుని కల్లు సేకరిస్తు ంటారు. చెట్ల వద్ద మాత్రమే కల్లు ప్రియులు తాగడం అనాధిగా వస్తున్నది. లోటా రూ.20 చొప్పున, లీటరు రూ.50 చొప్పున అమ్మకాలు సాగిస్తుంటారు. కల్లు ప్రియులు గ్రామాల్లో చెట్ల వద్దకు గుంపులు గుంపులుగా వెళ్లి సేవిస్తుంటారు. మరికొంత మంది రోడ్ల వార దుకా ణాల్లో విక్రయిస్తుంటారు.



ఆరోగ్య ప్రయోజనాలు..

కల్లులో అనేక ఔషధ గుణాలున్నాయని ఆయుర్వేద వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. తాటిచెట్టును పూర్వీకులు కల్పవృక్షంగా భావించేవారు. ఎటువంటి అనారోగ్యానికి గురైనా ఈ కల్లుతోనే పరిష్కరించే మార్గాన్ని పరిశీలించేవారు. తాటికల్లును చెట్ల నుంచి తీసిన వెంటనే తాగాలని ఆ కల్లులో ఆరోగ్య వంతమైన ఔషధాలుంటాయని, కాన్సర్ వంటి వ్యాధులు నయం అవుతాయని ఆయుర్వేదం చెబుతుందని నిపుణులు చెబుతున్నారు. కల్లు ఎక్కువ సమయం నిల్వ ఉంచితే పులిసి ఆల్కహాల్‌గా తయారవుతుందని అది ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు. కల్లు పులవకుండా ఉండేందుకు కాల్షియం హైడ్రాక్సైడ్ అనే రసాయనం కలుపుతుంటారు. దీంతో కల్లులో ఆల్కహాల్ శాతం పెరుగుతుంది. ఇది సేవించడం అంత మంచిది కాదు. 100 ఎం.ఎల్ కల్లులో 75 క్యాలరీలు ఉంటాయి.. ఇందులో ఉండే కార్బోహైడ్రేట్స్ కూడా సుక్రోజ్ రూపంలో ఉంటాయి. దీని సుగర్ వ్యాధి ఉన్నవారు తీసుకుంటే చాలా మంచిదని రక్తంలో చక్కర స్థాయిలు కూడా పెరగవని చెబుతున్నారు. తాటికల్లుకు టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు సోకకుండా కాపాడే గుణాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పొంగువంటి వ్యాధి వస్తుంది. ముఖ్యంగా వేసవిలో ఆ వ్యాధి చిన్నపిల్లల నుంచి పెద్దవారికి కూడా సోకుతుంది. ఈ వ్యాధి నివారణకు కల్లును దిష్టి తీసి ఆ వ్యాధి గ్రస్తులకు సేవింప చేస్తారు. ఈ సంప్రదాయం తరతరాలుగా వస్తున్నది.

ప్లాస్టిక్ భూతం అంతమెప్పుడు ?

పెరుగుతోన్న వినియోగం
నిషేధం అమలుపై నిర్లక్ష్యం
పర్యావరణం, ప్రజల ఆరోగ్యానికి ముప్పు



దెందులూరు సమీపంలో డ్రెయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

దెందులూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్, పాలిథీన్ కవర్లు వాడకం పెరుగుతోంది ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, స్పూన్లు వీటిలో ఏదో ఒకటి రోజులో ఒక్కసారైనా వాడుతూనే ఉంటాం. ప్లాస్టిక్ వస్తువుల వల్ల పర్యావరణానికే కాదు.. మానవ ప్రాణికోటి మనుగడకూ ముప్పే.. అందులో ఒక్క ప్లాస్టికే కాదు. అందులో ఉండే థాలేట్స్ వంటి రసాయనాలు కుడా మనుషుల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారాయి. ప్లాస్టిక్‌లో ఉండే విషపూరిత ప్రభావాలు పర్యావరణ కాలుష్యాన్ని మరింత పెరిగేలా చేస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం



ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టలేదు. కనీసం తనిఖీలు లేకలేదు. ఏ రోడ్డు , ఏ కాల్వ, చెరువులో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి పలు జాతీయ సంస్థలు చేపట్టిన అధ్యయనాల్లో దేశంలో తలసరి వార్షిక ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి 7 కేజీల 800 గ్రాముల ఉంది. అదే ప్రతి రోజు 100 నుంచి 110 గ్రాములుగా ఉంది. ఉమ్మడి పశ్చిమ జిల్లా జనాభా దాదాపు 28 లక్షల 40 వేలు పరిగణనలోకి తీసుకుంటే దాదాపు ఏటా సుమారు 22 వేల టన్నులు ప్లాస్టిక్ వినియోగం అవుతోంది. దెందలూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లో అన్ని కలిపి దెందులూరు నియోజవర్గంలో సుమారు 2 వేల టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో చేపల, చికిన్ వ్యాపారాలు చాలా ఎక్కువగా ఉండటంతో ప్లాస్టిక్ కవర్లను పెద్ద మొత్తంలో వాడుతున్నారు. వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. నిషేధం నామమాత్రంగా మారింది. మానవాళికి ప్రమాదకరమైన ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన ఆవశ్యకత ఉంది. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ కవర్లు అమ్మినా ఇచ్చినా తనీఖీల్లో దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు, గ్రామ పంచాయతీలు ప్రచారం చేస్తున్నా అమలు మాత్రం చేయడం లేదు. దీంతో విచ్చల విడిగా ప్లాస్టిక్ కవర్ల వాడకం పెరిగిపోయింది. కర్రీ పాయింట్‌లు, హోటల్స్ ఎక్కువగా వినియోగిస్తున్నారు. వేడి వేడి కూరలు, వివిధ రకాల ఆహార పదార్థాలు ప్లాస్టిక్ కవర్లలో పార్శిల్ చేయడం వల్ల ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధంపై గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరతున్నారు

• ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి



ప్లాస్టిక్, పాలిథీన్ కవర్ల వల్ల ఇప్పటికే పర్యావరణ కాలుష్యం అవుతోంది. ప్రభుత్వం వెంటనే ప్లాస్టిక్ కవర్లను నిరోధించాలి. లేకుంటే క్యాన్సర్ బారిన పడే అవకాశం ఎక్కుగా ఉం టుంది, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది, కాగితం, నీళ్లలో కరిగే కవర్లను ప్రజలందరూ వాడేవిధంగా ప్రభుత్వం అవగాహన కలిగించాలి. ప్లాస్టిక్ కవర్లు అమ్మేవారిపై గట్టి చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలకు ముప్పు లేకుండా చూడాలి.

రమేష్ బాబు, బాదంపూడి ట్రస్టు చైర్మన్, మేదినరావుపాలెం

స్టడీ సర్టిఫికెట్ల సమస్యకు పరిష్కారం

'ఆంధ్రజ్యోతి' కథనంతో డీఎస్సీ అభ్యర్థుల ఇక్కట్లకు ఉపశమనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : స్టడీ సర్టిఫికెట్ల కోసం మెగా డీఎస్సీ-2025 దరఖాస్తుదారులు పడుతున్న పాట్లకు 'ఆంధ్రజ్యోతి' కథనంతో పరిష్కారం లభించింది. దరఖాస్తు సమయంలో మిగతా ధ్రువీకరణ పత్రాలతోపాటు, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలంటూ ఇప్పటి వరకు వున్న నిబంధనలకు సవరణలు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవుల దృష్ట్యా హెచ్‌ఎంలు, టీచర్లు అందుబాటులో లేకపోవడంతో ఆయా పాఠశాలల్లో నాలుగు నుంచి పదో తరగతి వరకు చదివినట్టు స్టడీ సర్టిఫికెట్లు తీసుకోవడం మెగా డీఎస్సీ దరఖాస్తుదారులకు ఇబ్బందికరంగా పరిణమించిందని పేర్కొంటూ 'డీఎస్సీ అభ్యర్థుల ఇక్కట్లు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 28న కథనం ప్రచురితమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో డీఎస్సీ దరఖాస్తుదారులు ఇదేరకమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పత్రికా కథనంలో పేర్కొనగా, ఆ మేరకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి స్టడీ సర్టిఫికెట్ల అప్‌లోడ్ దరఖాస్తు సమయంలో తప్పనిసరికాదని భరోసా ఇవ్వడంతోపాటు, సమస్యకు పరిష్కారం చూపుతూ సోమవారం రాత్రి ట్వీట్ చేశారని అభ్యర్థులు వివరించారు.

దీనికనుగుణంగానే డీఎస్సీ అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించేటపుడు అవసరమైన ధ్రువీకరణ పత్రాల అప్‌లోడ్ తప్పనిసరికాదని, అభ్యర్థుల అర్హతల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో సమర్పిస్తే సరిపోతుందని సవరణ ఉత్తర్వుల్లో ప్రభుత్వ కార్యదర్శి పేర్కొన్నారు. ఆ మేరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో మాత్రం నిర్ణీత ధ్రువీ కరణ పత్రాలను సమర్పించే విషయంలో ఎటువంటి మినహాయింపులు ఉండబోవని స్పష్టం చేశారు. సవరణ ఉత్తర్వులతో డీఎస్సీ అభ్యర్థుల ఇక్కట్లకు ఊరట లభించినట్టయింది.

4న నీట్-యూజీ పరీక్ష

ఏలూరులో 3, గోపన్నపాలెంలో 2 పరీక్ష కేంద్రాలు

తాడేపల్లిగూడెం నిట్, శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్, తదితర మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా మే 4న జరగనున్న నీట్-యూజీ నిర్వహణకు జిల్లాల్లో ఏర్పాట్లపై మంగళవారం ఏలూరు, పశ్చిమ గోదావరి కలెక్టర్లు ఆయా జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరులోని కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, సుబ్బమ్మదేవి మున్సిపల్ పాఠశాల, కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల, దెందులూరు మండలం గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష జరుగుతుందని వివరించారు. మొత్తం 1200 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 11 గంటల నుంచే అనుమతిస్తారని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి అడ్మిట్ కార్డును మాత్రమే విద్యార్థులను అనుమతిస్తామని స్పష్టం చేశారు. పరీక్షల పేపర్లు, సామగ్రిని సూపరింటెండెంట్లు, పోలీసుల సహకారంతో మాత్రమే కస్టోడియన్లు పరీక్ష కేంద్రాలకు తీసుకురావాలని ఆదేశించారు. దివ్యాంగ విద్యార్థుల కోసం పరీక్ష కేంద్రాల్లో వీల్‌చైర్లు, సహాయకులను అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్‌ను అమలు చేయాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, మెడికల్ క్యాంపులు, తాగునీటి వసతి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెన్నులను పరీక్ష కేంద్రాల్లోనే విద్యార్థులకు అందజేస్తారని వివరించారు. నీట్-యూజీ పరీక్ష నిర్వహణకు సిటీ కో-ఆర్డినేటర్‌గా కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ భూర్‌సింగ్ మీనా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి మెజిస్ట్రీరియల్ అధికారిగా తహశీల్దార్ వ్యవహరిస్తారని, వీరంతా ఒకరోజు ముందుగానే ఆయా పరీక్ష కేంద్రాలకు వెళ్లి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద మహిళా పోలీసులను నియమించాలని కోరారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఈవో వెంకట లక్ష్మమ్మ, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, తహశీల్దార్లు శేషగిరి, సుమతి, ఎన్‌ఐసీ డీఐవో భానుప్రకాశ్, అన్ని పరీక్షకేంద్రాల ప్రిన్సిపాల్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పరీక్ష నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి

పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

పశ్చిమ కలెక్టర్ నాగరాణి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):పశ్చిమగోదావరి జిల్లాలో నీట్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్ ప్రాంగణంలో రెండు, శశి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిట్‌లో ఒక కేంద్రంలో 480, మరో కేంద్రంలో 660 మంది పరీక్ష రాయనుండగా శశిలో ఒక కేంద్రంలో 480, మరో కేంద్రంలో 300 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు నీట్ పరీక్షల జిల్లా నోడల్ అధికారి జయరాం తెలిపారు. పోలీస్ బందోబస్త్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి పరీక్షా కేంద్రాల వద్ద హాల్ టికెట్‌లను పరిశీలించి కేంద్రంలోకి అనుమతిస్తారు.

న్యాయం చేయండి

వైసీపీ నాయకులు నా ఆస్తి లాక్కున్నారు..

ఎమ్మెల్యేకు బాధితురాలి మొర



పొలం పత్రాలు చూపుతున్న బాధితురాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళను చేసి వైసీపీ నాయకులు తన ఆస్తిని దొంగ రిజి స్ట్రేషన్లతో అనుభవిస్తున్నారని తాడేపల్లి గూడెం మండలం వీరం పాలేనికి చెందిన శ్యామల నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి సత్తిరెడ్డి పేరున ఆర్ఎస్ఆర్ 193-4లో ఉన్న 1.74 ఎకరాల భూమిని రెండేళ్ల క్రితం అధికారం అడ్డు పెట్టుకుని వైసీపీ నేత ముప్పిడి వెంకట రెడ్డి తన తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తిగా దొంగ దస్తావేజులు రాయించుకుని అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపిం చారు. కోర్టుకు వెళ్లగా ఇంజెక్షన్ ఆర్డర్ ఇచ్చారని అది కూడా లెక్కచేయలేదన్నారు. చేను వద్దకు వెళ్లగా తమపై హత్యాయ త్నానికి పాల్పడ్డారని వాపోయారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు చెప్పుకోగా ఆయన న్యాయం చేస్తానని భరోసా ఇచ్చా రని తనకు పోలీసులు, ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

కొల్లేరులో మళ్లీ అదే సీన్



అడవికొలనులో చేపల చెరువు గట్లు కొట్టడానికి వచ్చిన ఫారెస్టు అధికారులను అడ్డుకుని నిరసన తెలియజేస్తున్న స్థానిక వరి రైతులు

అడవికొలనులో చెరువుకు గండి కొట్టేందుకు ఫారెస్టు అధికారుల ప్రయత్నం

అడ్డుకున్న స్థానిక రైతులు

పొలాలన్నీ మునిగిపోతాయని ఆవేదన

నిడమర్రు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):కొల్లేరు అభయారణ్య పరిధిలో గల చెరువులకు గండ్ల వివాదం ఫారెస్టు అధికారులకు స్థానిక వరి రైతులకు మధ్య టామ్ అండ్ జెర్రీ గేమ్‌లా ఉంది. మొన్న నిడమర్రు గ్రామ శివారులో జిరాయితీ భూమిలో గల చేపల చెరువు గట్లను కొట్టివేయడంతో సమీపంలోని వరి చేలు మునిగిపోయాయి. చేసిన తప్పును సరిదిద్దకోవడం కోసం ఫారెస్టు అధికారులు ఇంజన్లు పురమాయించి చేలల్లో నీళ్లు తోడే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం అడవికొలను శివారులో మరో చెరువుకు గండ్లు కొట్టడానికి ప్రయత్నాలు చేయడం మొదలు పెట్టగా సమీపంలో వరి రైతులు వచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు రైతుల పక్షాన నిలబడడంతో అక్కడకు అది ఆగింది. ఫారెస్టు అధికారుల ఈ చెరువుకు గండి పెట్టినట్లయితే ఈ ఆయకట్టులో గల సుమరు 40 ఎకరాల వరిపొలాలు మొత్తం నీటిపాలవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో ఇలా రైతులను భయభ్రాంతులను చేయడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులు స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దృషికి విషయం తీసుకువెళ్లగా ఆయన రైతులతో కలసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఫోన్‌లో అపాయింట్ తీసుకొని సాయంత్రం ఏలూరులో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.

• వాయిదా వేయాలి



కొల్లేరులో 10 ఎకరాలు వరి సాగు చేస్తున్నాను. ఇప్పటికే సుమారు 6 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాను. ఫారెస్టు అధికారులు రైతులపై పగపట్టినట్లు వ్యవహ రిస్తున్నారు. 110 ఎకరాల చెరువు గండిపెడితే మా పొలాల్లో మోకాలు పైనే నీరు పడిపో తుంది. దీంతో చేను ఎందుకు పనికిరాకుండా పోతుంది. అధికారులు చెరవులకు గండ్లు పెట్టే పనిని వాయిదా వేయా లని కోరుతున్నాం. లేకపోతే తీవ్రంగా నష్టపోతాం

-కోటిపల్లి రాధాకృష్ణ, రైతు అడవికొలను

• గండి పెడితే పంటంతా పోయేది



నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఆరుగాలం కష్టించి పండించుకొన్న పంట కోతకు వచ్చే సమయంలో ఫారెస్టు అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా చెరువు లకు గండ్లు పెట్టడానికి ప్రయత్నించారు. పెద్ద చెరువుకు గండ్లు పెడితే మా పొలం అంతా నీటి మునిగి కోతకు పనికి రాకుండా పోతుంది. ఫారెస్టు అధికారుల చర్యలను ప్రతిఘటించాల్సి వచ్చింది

- పాల సత్యనారాయణ, రైతు అడవికొలను

• గండి పెడితే చేలన్నీ కొల్లేరే



అడవికొలను తీరంలో ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకొని బతుకుతున్నాం. మా తాతల కాలం నుంచి దాళ్వా సాగు చేస్తున్నాం. ఫారెస్టు అధికారులు ఆక్వా చెరువులపై కక్షతో గండ్లు కొట్టడం వల్ల మా పొలాలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. మా పొలాలను రక్షించాలని స్థానిక ప్రజా ప్రతినిధులను, అధికారులను వేడుకొంటున్నాం. పెద్ద చెరువుకు గండి పెడితే మా పొలాలన్నీ కొల్లేరును తలపించేలా మునిగిపోతాయి.

- పమ్మి గోవింద్, రైతు

వివాదాస్పద చేపల చెరువు సర్వే

మూడు రోజులుగా వివాదాల్లో చిక్కుకున్న కొల్లేరు అభయారణ్యం సమీపంలో గల జిరాయితీ భూమిలో గల చేపల చెరువులో ఎట్టకేలకు సర్వే ప్రారంభమైంది. మంగళవారం ఉదయం రైతు వగ్వాల సుబ్బారావు, పలువురు చేసుకున్న దరఖాస్తు మేరకు రెవెన్యూ అధికారులు ఆర్.ఎస్ నెం 433 -1,2,3,4 లో గల 6.24 ఎకరాల భూమిలో సర్వే చేపట్టారు. సరిహద్దులో గల భీమడోలు, నిడమర్రు మండలం సరిహద్దులు కూడా నిర్ణయం జరిగుతున్నందున ఇరు మండలాల రెవెన్యూ అధికారులు. సర్వేయర్లు సమక్షంలో సర్వే ప్రారంభించారు. భీమడోలు మండలం చెట్టున్నపాడు గ్రామ రెవెన్యూ సరిహద్దు, నిడమర్రు మండలం వెంకటాపురం గ్రామ రెవెన్యూ కాంటూరు సరిహద్దులను ప్రాథమికంగా పరిశీలించారు. కోర్టు కేసుల వల్ల ఫారెస్టు అధికారులు హాజరు కాలేకపోయారని రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో సర్వే వాయిదా వేశారు. ఫారెస్టు అధికారులను సంప్రదించి మండల అధికారుల సమక్షంలో తదుపరి సర్వే తేదీని తెలియజేస్తామని నిడమర్రు తహశీల్దార్ నాగరాజు తెలియజేశారు.



నిడమర్రులో వివాదాస్పద చేపల చెరువులో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

నకిలీ కుల ధ్రువపత్రంతో అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం

కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):బీసీ కులానికి చెందిన ఒక మహిళ ఎస్సీ ధ్రువపత్రంతో అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం చేస్తున్నదని, అర్హత కలిగిన ఎస్సీ కులానికి చెందిన తనకు అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ బాధిత మహిళ జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. కలిదిండి మండలం పెదలంక శివారుకు చెందిన చాబత్తిన బేబీ రాజేశ్వరి 2020లో ఎస్సీ కోటాలో కైకలూరు ఐసీడీఎస్ పరిధిలో కోడ్ నెంబర్ 618లో అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు ప్రకటన వెలువడింది అన్నారు. దీంతో అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు తాను దరఖాస్తు చేసుకోగా ఇదే పోస్టుకు యాళ్ల రాజమణి దరఖాస్తు చేసుకుందని తెలిపారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నాయకులు పైరవీలు చేసి బీసీ కులానికి చెందిన యాళ్ళ రాజమణికి పోస్ట్ కేటాయింపు జరిగిందని తెలిపారు. ఈ విషయంపై ఐసీడీఎస్, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అప్పట్లో పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో తాను హైకోర్టును ఆశ్రయించగా రాజమణి కుల ధ్రువపత్రంపై విచారణ చేయాలని ఆదేశించిన హైకోర్టు ఆదేశాల సైతం పట్టించుకోలేదని వివరించారు. తన ఫిర్యాదుపై విచారణ చేసి అంగన్‌వాడీ టీచర్ పోస్టు తనకు కేటాయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

రెండో పెళ్లి.. ఆపై కట్నం వేధింపులు : ఒకరికి ఏడాది జైలు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):తనకు వివాహమైన విషయం దాచి మరో మహిళను పెళ్లి చేసుకోవడమే కాకుండా అధిక కట్నం కోసం రెండో భార్యను వేధిస్తున్నాడనే ఫిర్యాదుతో కేసు విచారణ అనంతరం పడాల చిరంజీవి రెడ్డికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానాను తాడేపల్లిగూడెం మెజిస్ట్రేట్ విధించారు. 2015లో నమోదైన కేసు విచారణ అనంతరం మంగళవారం తాడేపల్లిగూడెం కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్.సూర్యకిరణ్‌శ్రీ తీర్పు వెల్లడించారు. ఏడాది జైలు రూ.10 వేల జరిమానా చెల్లించాలని, లేకుంటే మరో మూడు నెలలు జైలు శిక్ష ఉంటుందని తీర్పులో తెలిపారు.

వాహనం పైనుంచి కింద పడి మహిళ మృతి

భీమవరం క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):భీమవరం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని యనమదుర్రు రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చొన్న మహిళ జారిపడిపోవడంతో తలకు గాయమై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భీమవరం రూరల్ మండలం దిరుసుమర్రుకు చెందిన జి.మేరీమాత (40) బంధువుతో భీమవరం నుంచి ఇంటికి వెళ్తుండగా వాహనం మీద నుంచి కిందకు పడటంతో తలకు తీవ్ర గాయమైంది. ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి రూతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

వేర్వేరుచోట్ల ఐదుగురి బలవన్మరణం

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని వేర్వేరు చోట్ల మంగళవారం ఐదుగురు వ్యక్తులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రేమ వ్యవహారంలో ఒకరు, పెళ్లి ఇష్టం లేక మరొకరు, మతిస్థిమితం లేక ఇంకొకరు, అనారోగ్యంతో ఒకరు.. మనస్థాపంతో ఇంకొకరు ఇలా ఒకే రోజు ఐదుగురు బలవన్మరణాలకు పాల్పడడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

ప్రేమ వ్యవహారంలో విద్యార్థిని..!



తేజస్విని (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు జిల్లా పాత చింతలపూడికి చెందిన కొండమురుగు తేజస్విని (21) తాడేపల్లిగూడెంలోని మదర్ వన్నిని ఆసుపత్రిలో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. చింతలపూడికి చెందిన తిమోతి అనే యువకుడితో కొన్నేళ్లుగా ప్రేమ వ్యవహారంలో వున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో మనస్థాపంతో తేజస్విని ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. ఆ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో వార్డెన్ హాస్టల్‌లో లేదని విద్యార్థులకు అనుమానం వచ్చి తలుపులు పగలకొట్టే సరికి అప్పటికే ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిందని స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు.

చోరీకి పాల్పడి.. మనస్థాపానికి గురై

ఉండి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉండి మండలం కోలమూరుకు చెందిన ఆలమూరు జోషిరాజు(33) ఐదు రోజుల క్రితం గ్రామంలోని ఒకరి ఇంట్లోకి వెళ్లి సెల్‌ఫోన్, రూ.1,500 నగదును దొంగిలించాడు. విషయం బయటపడటంతో పెద్దమనుషుల సమక్షంలో పెట్టి అడగడంతో అప్పటి నుంచి అతను మనస్థాపానికి గురయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

మతి స్థిమితం లేక.. పెట్రోలు పోసుకుని

ఏలూరు క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):మతిస్థిమితం లేని ఒక వ్యక్తి తనపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జంగారెడ్డిగూడెంలోని ఆర్టీసీ డిపో వెనుక ప్రాంతంలో నివాసం ఉంటున్న దెయ్యం పోసయ్య (40) రెండేళ్ల నుంచి మతిస్థిమితం సరిగా లేదు. మంగళవారం ఉదయం తన ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్లి తనపై పెట్రోలు పోసుకుని అగ్గిపుల్ల గీసుకుని అంటించుకున్నాడు. మంటల్లో చిక్కుకున్న అతనిని అతని సోదరుడు వెంకటేశ్వరరావు చుట్టు పక్కల వారు కలిసి మంటలను ఆర్పి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి వద్దని.. గోదావరిలోకి దూకి..



కుక్కునూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):తెలంగాణ లోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురానికి చెందిన ఉప్పల సాయి రామ్(30) గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకు న్నాడు. సాయిరామ్ తల్లిదండ్రులు ఇటీవల పెళ్లి చేసుకోమని సంబంధాలు చూస్తున్నారు. అతను పెళ్లికి నిరాకరించి కుక్కునూరులోని గోదావరి రేవులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూలశంక భరించలేక..

పెంటపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామానికి చెందిన దాసం ఉమేష్ (28) ఒక ప్రైవేటు షాపులో పనిచేస్తున్నాడు. ఇతని భార్య గర్భవతి. అయితే తనకు ఉన్న మూల శంక వ్యాధి భరించలేక చనిపోతానంటూ తరచూ తమతో అనేవాడని కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం తన ఇంటిలోని పైగదికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. తలుపులు ఎంతకు తీయకపోవడంతో అనుమానంతో కుటుంబసభ్యులు తలుపులు పగుల కొట్టి చూడగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

395 కేజీల గంజాయి స్వాధీనం

ఐదుగురి అరెస్టు.. వ్యాన్, కారు సీజ్ : ఐజీ, ఎస్పీ



నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న ఐజీ, ఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఈగల్ టీమ్, ఏలూరు జిల్లా పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా గంజాయి పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిశోర్‌తోపాటు రాష్ట్ర ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ, ఈగల్ టీమ్ ఎస్పీ నగేష్‌బాబు పాల్గొన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని రాష్ట్రం మీదుగా వరంగల్‌కు రవాణా అవుతుందని ఇంటెలిజెన్స్ విభాగం ఇచ్చిన సమాచారంతో ఈగల్ టీమ్, జంగారెడ్డిగూడెం సీఐ వి.కృష్ణబాబు, వారి సిబ్బంది కలిసి నిఘా ఏర్పాటు చేశారు.

మంగళవారం తెల్లవారుజామున దేవరపల్లి నుంచి తల్లాడ వైపుకు వెళ్ళే రోడ్డులో జంగారెడ్డిగూడెం మార్గంలోని మార్కెట్‌యార్డు చెక్‌పోస్టు వద్ద అనుమానం కలిగి ఒక వ్యాన్, కారును తనిఖీ చేశారు. ఆ రెండు వాహనాల్లో 395 కేజీల గంజాయి (189ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటు నాలుగు ఫోన్లను కూడా సీజ్ చేశారు. ఈ గంజాయి సుమారుగా 39లక్షల 49 వేల 950 రూపాయలు ఉంటుందని అంచనా వేశారు.

ఈ కేసులో గంజాయి సరఫరా చేసే వ్యక్తులు కాకినాడ జిల్లాకు చెందిన మనం చెంద్రదొర అలియాస్ దొరబాబు, అనకాపల్లి జిల్లాకు చెందిన ఈపు ధనరాజు, రవాణాదారులు అయిన కాకినాడ జిల్లాకు చెందిన నాయుడు రాజా, బొంతు దుర్గా సతీష్, కుడితి చిన్నిలను అరెస్టు చేశారు. ఒక వ్యాను, మారుతీ షిఫ్టు డిజైర్ కారును సీజ్ చేశారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ ఇటీవల గరుడ ఆపరేషన్ పేరుతో రాష్ట్రంలోని 165 మందుల షాపులను తనిఖీలు చేసినట్టు తెలిపారు. ఏలూరు జిల్లాలో ఐదు మెడికల్ షాపులపై కేసులు నమోదు చేశామన్నారు.

టైరు పేలి అరటి గెలల వ్యాను బోల్తా

ఒకరి మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతం

ఏలూరు క్రైం/ద్వారకాతిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):అరటితోటలో నుంచి అరటి గెలలను లోడు చేసుకుని వెళ్తున్న వ్యాను మార్గమధ్యలో టైర్లు పేలిపోవడంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాను డ్రైవర్‌తోపాటు కూలికి వచ్చిన మరో నలుగురు తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిలో ఒక కూలీ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు.

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన కాకర్ల లవరాజు(30) వ్యాను డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనితోపాటు అనుబాలు రామకృష్ణ (55), దుంపా శివ సూర్యనారాయణ(35), కోనా సత్తిబాబు (50), ఏలేశ్వరం మండలం భద్రవరానికి చెందిన పులిపంతుల ఈశ్వరరావు(45) కలిసి ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామంలోని అరటితోటకు మంగళవారం ఉదయం వెళ్ళారు. గెలలను నరికి వ్యానులో లోడు చేసుకున్నారు. తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో భీమడోలు దాటిన తరువాత గుణ్ణంపల్లి సమీపంలోని పోలవరం కుడి కాలువ బ్రిడ్జి వద్ద వ్యాను టైర్లు పేలిపోయి బోల్తా కొట్టింది. ప్రమాదంలో అరటి గెలలు చెల్లా చెదురై రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఈప్రమాదంలో వీరందరూ తీవ్ర గాయాలకు గురికాక 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికే అనుబాలు రామకృష్ణ మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

బస్సు, ట్రాక్టర్ ఢీ.. ఏడుగురికి గాయాలు



ఉంగుటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):ఉంగుటూరు మండలం బాదంపూడి మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. తాడేపల్లిగూడెం నుంచి ద్వారకాతిరుమల వెళ్తున్న ఆర్టీసీ బస్సు గూడెం వైపు వస్తున్న ట్రాక్టర్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులోని కె.అవీష్, ఆర్.సరోజ, ఇ.మేఘన, ఆర్.తేజస్విని, ఆర్.పావని, సి.హెచ్.రమేశ్, సి.హెచ్.రమణ గాయపడ్డారు. మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చిన వాహనాలు సరిగా కనిపించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. వీరిని చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

వర్షాలకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

పోలవరం/జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : పోలవరం, జంగారెడ్డిగూడెం మండలాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు ప్రగడపల్లిలో రహదారిపై చెట్లుకూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నిలిచిన వాహనాలలో రెండు 108 వాహనాలు నిలిచిపోవడంతో తహశీల్దారు సాయి రాజు ఆధ్వర్యంలో స్థానికులు యుద్ధప్రాతిపదికన చెట్లు తొలగించడంతో మార్గం సుగమం అయ్యింది. బుట్టాయగూడెం రోడ్డులో చెట్టు నేలకొరగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

వేసవి జాగ్రత్తలపై పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఏలూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : వేసవిలో వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన పోస్టర్‌ను కలెక్టరేట్ మంగళవారం ఆవిష్కరించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వృద్ధులు, చిన్న పిల్లలు ఇంటికే పరిమితమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ రాజీవ్, డీఈఎం వెంకటలక్ష్మమ్మ, ఐసీడీఎస్ పీడీ పి.శారదలు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్ అధ్యక్షతన బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా నవసమాజ్ సొసైటీ ఛైర్మన్ నేతల రమేశ్‌బాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ బాల్య వివాహాలు అరికట్టడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ సీఎస్‌డబ్ల్యూ జి.రాజ్యలక్ష్మి, మేడిశెట్టి గిరిబాబు, కొత్తల పూర్ణమల్లికార్జున్, దాసి వెంకటేశ్వర్లు, బయ్యారపు వెంకటరమణ, ఎ.సత్యనారాయణ, బి.తిరుమలరావు, బీశెట్టి నరసింహ పాల్గొన్నారు.

నూతన చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : ఏలూరు మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘాలతో జనరల్ బాడీ సమావేశం యూనియన్ సెక్రటరీ యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం ఏలూరు మార్కెట్ యార్డ్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు హాజరై మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేసే కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేలా ఉద్యమాలను చేపట్టాలన్నారు. సమావేశంలో మీసాల రమణ, విజయ్, జి.రమణ, పల్లి గంగరాజు, కోరాడ మంగరాజు రాము, అప్పారావు, పాతాళ అప్పారావు, దుర్గారావు, సింహాచలం, పద్మ పాల్గొన్నారు.

9న భారత దళిత సేన జాతీయ సమావేశాలు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : భారత దళిత సేన (బిడిఎస్) జాతీయ కార్యవర్గ సమావేశాలు మే 9న విజయవాడ అంబేద్కర్ భవన్‌లో జరుగుతాయని భారత దళిత సేన జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఇ.బి.స్వామి, అలుగు ఆనందశేఖర్ తెలిపారు. మంగళవారం ప్రియదర్శిని కళాశాలలో భారత దళిత సేన జాతీయ కార్యవర్గ పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘ జాతీయ అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ జాతీయ కార్యవర్గ సమావేశాలకు కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ హాజరవుతారన్నారు.దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీడీఎస్ యువజన విభాగ ఏపీ అధ్యక్షుడు గూడపాటి వెంకటేశ్వర రావు, కాటం ప్రసాద్, బాతుల వేణు, పి.సత్యనారాయణ, ఎం.రమ్య, జి.గిరిబాబు, బి.వెంకటేశ్వరరావు, జి.మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల శిక్షణ తరగతుల పరిశీలన


విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో

బుట్టాయగూడెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకపోవడానికి కారణాలను తెలుసుకుని విద్యార్థులకు పాఠ్యాంశాల్లోని అనుమానాలను ఉపాధ్యాయులు నివృత్తి చేయాలని కె.ఆర్.పురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్ ఆదేశించారు. టెన్త్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు దొరమామిడి, తెల్లంవారిగూడెం ఆశ్రమ బాలబాలికల పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు చేపట్టగా మంగళవారం పీవో పరిశీలించారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అధికారులు, హెచ్‌ఎంలు, వార్డెన్లు, ఉపాధ్యాయులు విద్యార్థులకు సహకారం అందించాలని సూచించారు. పీవో వెంట ఇన్‌చార్జీ డీడీ శ్రీవిద్య, ఏఎంవో శిరమయ్య, పాఠశాల హెచ్‌ఎం బెనర్జీ ఉన్నారు.

జొన్నవారిగూడెం శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : తాడువాయి పంచాయతీ పరిధిలోని జొన్నవారిగూడెం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన శ్మశాన వాటికను జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అందుగుల ఫ్రాన్సిస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందడంతో శ్మశాన వాటికకు తీసుకెళ్లగా దారి సరిగా కనిపించక ఇబ్బందులు పడినట్టు ఫ్రాన్సిస్ తెలిపారు. అధికారులు స్పందించి దళితుల శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని, స్మశాన వాటికలు లేని గ్రామాల్లో స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

రెడ్‌క్రాస్ సొసైటీ నూతన ఛైర్మన్‌గా ప్రసాద్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఛైర్మన్‌గా డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ భవనంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు అధ్యక్షతన, రెడ్‌క్రాస్ ఏపీ స్టేట్ బ్రాంచ్ అబ్జర్వర్ పి.రామచంద్రరాజు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులుగా 11 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ప్రసాద్, వైస్ ఛైర్మన్‌గా జె.సత్యనారాయణరాజు, ట్రెజరర్‌గా ఎన్.బ్రహ్మానందం, కమిటీ సభ్యులుగా ఆలపాటి నాగేశ్వరరావు, మునగాల మురళీకృష్ణ, కొత్త గుండు శ్రీనివాస్, మేతర అజయ్‌బాబు, పెన్మమత్స శ్రీరామరాజు, మోతేపల్లి చంద్రశేఖర్, బొల్లా లక్ష్మీనారాయణ, ఎంవీవీఎస్ నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. గౌరవ ఆడిటర్‌గా గురజాడ శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. వీరి చేత డీఆర్వో ప్రమాణ స్వీకారం చేయించారు.

బాలికా సదన్‌ను పరిశీలించిన జడ్జి రత్నప్రసాద్

ఏలూరు క్రైం/దెందులూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : బాలలు వేసవి సెలవుల్లో కాలాన్ని వృథా చేయకుండా పుస్తకాలు చదవడం, చదరంగం తదితర ఆటలతో మె దడుకు పదును పెట్టాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. దెందులూరులో ఉన్న బాలిక సదన్‌ను మంగళవారం సాయంత్రం జడ్జి రత్నప్రసాద్ సందర్శించారు. అక్కడ బాలలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆహారపదార్థాలను రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ అభివృద్ధికి విద్య ఒక్కటే రాజమార్గమని సూచించారు. ఈ కార్యక్రమంలో బాల సదన్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్ర కళాశాలకు అంతర్జాతీయ స్థాయి అవార్డు


అవార్డు అందజేస్తున్న కేంద్ర మంత్రి

పెదపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని రామచంద్ర ఇంజనీ రింగ్ కళాశాల విద్యార్థి రూపొందించిన అత్యాధునిక సోనిక్ అగ్రికల్చర్ వాటర్ పంప్ టెక్నాలజీకి అవార్డు లభించిందని ఎండీ కె.సాయిరోహిత్ తెలిపారు. అమరావతి వీఐటీలో ఈ నెల 28న జరిగిన అంతర్జాతీయ వి లాంచ్ ప్యాడ్ - 25 పోటీల్లో గెలుపొందిన అవార్డును కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా అందుకున్నట్టు తెలిపారు. ఈ టెక్నాలజీ ద్వారా నీటి పంపింగ్ విషయంలో రైతులకు అనేక లాభాలతో పాటుగా ఆర్థిక పరమైన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, నీటి సరఫరాకు వెచ్చించే మొత్తం 90 శాతం తగ్గుతుందని సాయి రోహిత్ తెలిపారు. ఈ ఆవిష్కరణతో అంతర్జా తీయ స్థాయి గుర్తింపు తెచ్చిన ఫ్యాకల్టీ భవన్నారాయణ, విద్యార్థి జి.ఉమా నవీన్ కుమార్‌లను కళాశాల ఛైర్మన్ కె.వేణుగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. మురళీధరరావులు అభినందించారు.

ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వాలి

కొయ్యలగూడెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి ప్రతి ఒక్కరూ స్పందించి చేయుతనివ్వాలని ప్రముఖ వ్యాపారవేత్త కొల్లూరి సత్తిబాబు కోరారు. ఈమేరకు మంగళవారం కొయ్యలగూడెం పట్టణానికి చెందిన కంచర్ల రాజేశ్ కుమార్తె ఇటీవల అంతుచిక్కని జీబీఎస్ వ్యాధికి గురికావడంతో ఆ కుటుంబం వైద్యం చేయించుకోలేక ఇబ్బందులుపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సత్తిబాబు ఆ చిన్నారికి నగదు సహాయం అందజేశారు. ప్రతీ ఒక్కరు ఆమెకు సహాయం అందించాలని కోరారు.

మద్ది క్షేత్రంలో మండపేట ఎమ్మెల్యే జోగేశ్వరరావు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గురవాయిగూడెం మద్ది అంజనేయుని మండపేట ఎమ్మెల్యే వి.జోగేశ్వరరావు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు, ప్రసాదాలతో సత్కరించారు. మద్ది క్షేత్రంలో మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. స్వామికి సేవల రూపంలో రూ.1,73,139 ఆదాయం సమకూరినట్టు ఈవో చందన తెలిపారు.

పట్టుదలతో ఉన్నత లక్ష్యం సాధించాలి

విద్యార్థులకు సూచించిన కలెక్టర్ వెట్రిసెల్వి



చిన్నారులతో కలెక్టరేట్ వెట్రిసెల్వి

ఏలూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) :పట్టుదల, ఉన్నత లక్ష్యంతో దేనినైనా సాధించవచ్చని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కోవిడ్ మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలలు పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ స్కీమ్‌లో ఉన్న లబ్ధిదారులతో కలెక్టరేట్‌లో ఆమె మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఏలూరు జిల్లాలో ఉన్న 26 మంది బాల, బాలికలకు గార్డియన్‌గా ఉన్న ఆమె పిల్లలతో మమేకమై ప్రతీ బాల, బాలిక యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వారు చదువుతున్న పరిస్థితి తెలుసుకుని సమాజంలో ఉన్న పరిస్థితి బట్టి పోటీతత్వంతో చదువుతూ ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. 18 ఏళ్ల వయస్సు నిండి వివాహం చేసుకున్న వట్లూరుకు చెందిన యువతి చంద్రికకు మే 7న వివాహం నిర్ణయించగా, వారు కలెక్టర్‌కు ఆహ్వానపత్రిక ఇవ్వగా తప్పకుండా హాజరవుతానని తెలిపారు. ఇద్దరు బాలిలకు 10 లక్షల డిపాజిట్ అయి పోస్టల్ అక్కౌంట్స్‌కు సంబంధించిన పాస్‌బుక్‌లను వెట్రిసెల్వి అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ పీ శారద, జిల్లా బాలల సంరక్షణాధికారి డాక్టర్ సూర్య చక్రవేణి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎన్ జితేంద్రబాబు, జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్‌లు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చెయ్యండి


మంత్రి నాదెండ్లను సన్మానిస్తున్న సురేంద్ర

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మే 2న జరిగే మోదీ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ సురేంద్ర అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సురేంద్ర ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ గవర సామాజిక వర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.కార్యక్రమంలో మంత్రి పార్థసారధి, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.

మోడీ సభకు పారిశుధ్య సిబ్బంది..

ఏలూరుటూటౌన్ : రాజధాని అమరావతికి విచ్చేస్తున్న మోదీ సభకు ఏలూరు నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది 160మంది తరలివెళ్లారు. మంగళవారం సాయంత్రం లారీలో కార్మికును తరలించారు. అనంతరం నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ మోదీ సభకు లక్షలాది మంది ప్రజలు హాజరవుతారని అన్నారు. పారిశుధ్య పనులు నిర్వహించేందుకు 160మంది పారిశుధ్య సిబ్బందిని అమరావతికి పంపించామన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, డ్రైవర్లు, వర్కర్లు, తరలివెళ్లారన్నారు. కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను పంపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. వెళ్లినవారందరికి భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఉగ్ర దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు లక్ష్మీనగర్, లునానినగర్ అభివృద్ధి కమిటీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో లక్ష్మీనగర్ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ నాయకులు కే.సత్యనారాయణ, జీ.మురళీ, కొరపాటి కిషోర్, వారా సల్మాన్‌రాజు, యలమర్తి హృదయరాజు, రాణిటీచర్, రామ్‌దాస్ మాస్టారు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కార్యాలయ భవన
పునర్నిర్మాణానికి భూమిపూజ

చింతలపూడి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చింతపూడి నగర పంచాయతీ భవన పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ రెండు భవనాలను కలుపుతూ మెట్లు నిర్మాణం జరుగుతోందని తెలిపారు. అంతే కాకుండా నగర పంచాయతీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కమిషనర్ అంబటి రాంబాబు మాట్లాడుతూ సెంట్రల్ లైటింగ్, శానిటేషన్, వాటర్ లీకేజీలపై పాతబస్టాండ్ సమీపంలో మొహిద్దీన్ చెరువుకట్టపై పార్కు నిర్మాణం, వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జె.ముత్యాలరెడ్డి, జి.హెచ్.ధర్మరాజు, మధుబాబు, రాజారెడ్డి, శేషగిరి పాల్గొన్నారు.


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

పెదవేగి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం రాకతో గుంతల రోడ్లకు మోక్షం కలిగిందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.45 లక్షలతో పినకడిమిలో నిర్మించనున్న బీటీ, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. రోడ్ల నిర్మాణం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు.

గోనె సంచులను అందజేయండి

ఏలూరుసిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : రబీ ధాన్యం సేకరించడంలో భాగంగా సిఎంఆర్‌లో పాల్గొనే రైస్ మిల్లులకే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులు పంపే బాధ్యతను అప్పగించినట్టు పౌరసరఫరాల సంస్థ ఏలూరు జిల్లా మేనేజర్ పి శివరామమూర్తి మంగళవారం తెలిపారు. ఏలూరు జిల్లాలోని 5 రైస్ మిల్లులు వారికి ఇచ్చిన టార్గెట్‌కు అనుగుణంగా గోనె సంచులను పంపించలేదని, ఈ మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 49 రైస్ మిల్లులు యాజమాన్యానికి 18 గంటల లోపు దిగుబడి చేయనందున వారికి కూడా షోకాజ్ నోటీసు జారీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా సీఎంఆర్‌లో పాల్గొనే ప్రతి రైస్ మిల్లుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మంచి గోనె సంచులనే పంపాలన్నారు.

వర్మి కంపోస్టు షెడ్లను వినియోగించుకోండి

కొయ్యలగూడెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : వర్మీకంపోస్టు షెడ్లను వినియోగించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని (డీపీఓ)అనూరాధ కోరారు. ఈ మేరకు మంళవారం మండలంలోని కన్నాపురం, నర్సన్నపాలెం పంచాయతీల్లో ఏర్పాటు చేసిన వర్మీకంపోస్టు షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటి నుంచి సేకరించిన చెత్తను తడి, పొడిచెత్తగా వేరు చేసి వర్మీకంపోస్టు షెడ్లలో వినియోగించాలన్నారు. అన్ని గ్రామాలు పారిశుధ్య నిర్మూలన గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. దీనికి ప్రజల సహకారం ఎంతైన ఉందని ఈ సందర్భంగా తెలిపారు. వేసవి దృష్ట్యా ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యదర్శులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఈమె వెంట ఎంపీడీవో కిరణ్‌కుమార్, కన్నాపురం పంచాయతీ కార్యదర్శి రవికుమార్, పరింపూడి పంచాయతీ కార్యదర్శి సురేశ్, నర్సన్నపాలెం పంచాయతీ కార్యదర్శి సింధుజ ఉన్నారు.

పిల్లల పోషణ సక్రమంగా ఉండాలి

పెదవేగి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : పిల్లల ఎత్తు, బరువు ఎప్పటికప్పుడు సరిచూస్తూ పోషణ సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీవో ఎం.సునీల్ రాజశేఖర్ అన్నారు. పెదవేగిలో మంగళవారం నిర్వహించిన అంగన్‌వాడీ సెక్టారు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. పిల్లల ఆరోగ్య సంరక్షణకు అనువుగా పోషకాహారాన్ని అందిస్తుందని, పిల్లలు ఖచ్చితమైన ఎత్తు, బరువు ఉండేలా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పిల్లల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పారు. ప్రతినెల మొదటి మంగళవారం, మొదటి శుక్రవారం కిశోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోర్ బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మేడే వేడుకలను ఘనంగా జరుపుకోవాలి

పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : దొరసానిపాడులో మంగళవారం మేడే వాల్ పోస్టర్లను అంగన్వాడీ సెంటర్ల వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కేంద్రం 8గంటల పనిహక్కును రద్దు చేసి 12గంటలు పెంచే యోచనలో ఉందన్నారు. దీనిని ప్రతిఘటించాల్సిన అవసరం అందరికీ ఉందన్నారు. కార్యక్రమంలో మండల నేతలు హేమలత, సుధా, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం : మేడే వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపునిచ్చారు.. ఈ మేరకు ధర్మాజీగూడెం, మఠంగూడెం గ్రామాల్లో మేడే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో కార్మికులు, ఉద్యోగుల జీతాల్లో కోతలు పెడుతున్నారని అన్నారు. కేంద్రం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బీజేఎన్ కుమారి, ఈశ్వరి, మార్తమ్మ, షరీఫ్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

● టీ.నర్సాపురం : కార్మికుల దినోత్సవమైన మేడేని జయప్రదం చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. మర్రిగూడెంలో మేడే కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే పోరాట స్ఫూర్తిని ప్రపంచమంతా చాటి చెబుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం డివిజన్ నాయకులు బాబురావు, కొండరాము, మండల నాయకులు కట్టం కాటయ్య, చుట్టి నాగేశ్వరరావు, సోయం పుల్లేష్, కనకయ్య, నాల దుర్గారావు, చూడెం రామారావు పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోండి


ధర్మాజీగూడెంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

దెందులూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : పోతునూరు శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిక్షణ తరగతులను జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పలి, గ్రంథపాలకుడు జి.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే దెందులూరులోని గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు ఝాన్సీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలకు సెలవులు కావడంతో విద్యార్థులు గ్రంథాలయాలల్లో ఉపయోగించుకునేలా శిక్షణ తరగతులను నిర్వహించారు.

● ఏలూరు అర్బన్ : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం బాలల గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక సమీక్షను నిర్వహించారు. సీనియర్ రీడర్ గంగాధర్‌రావు గ్రంథాలయానికి ఒక సీలింగ్ ఫ్యాన్, విద్యార్థులకు నోట్ పుస్తకాలను బహూకరించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ విశాలాక్షి విద్యార్థులందరికీ అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు చాముండేశ్వరరావు, పద్మనాభరావు, లైబ్రరీ నిర్వాహకురాలు ఎం. శోభ పాల్గొన్నారు.

● లింగపాలెం : విద్యార్థులు పోటీ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోవాలని గంథాలయాధికారి సి.హెచ్. వెంకట రమణ అన్నారు. ధర్మాజీగూడెం శాఖ గంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతుల సందర్భంగా విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంథాలయాధికారి సి.హెచ్.వెంకట రమణ, రిసోర్స్ పర్సన్ ఎ.వి.నారాయణ, షేక్ అహ్మద్ గణితం బోధించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

● పెదపాడు :వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా రెండవ రోజు పెదపాడు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషుపై మెలకువలు నేర్పించినట్టు గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు తెలిపారు. రిసోర్స్‌పర్సన్ పూడి రవికుమార్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

● పెదవేగి : విద్యార్థులు భాషపై పట్టును పెంచుకో వాలని రీసోర్స్ పర్సన్ అప్పవీ తస్నీమ్ అన్నారు. పెదవేగి శాఖాగ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం రీసోర్స్ పర్సన్ అప్పవీ తస్నీమ్ హిందీ భాషపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తస్నీమ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పకుండా హిందీ భాషను ఖచ్చితంగా అభ్యసించాలని అన్నారు. గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రామచంద్రరావుపేటలోని దుకాణంలో తనిఖీలు

● ఎనిమిది కేసులు నమోదు
● మూడు లక్షల రూపాయల జరిమానా


షాపులోని వస్తువులు పరిశీలిస్తున్న అధికారులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : ఏలూరు రామచంద్రరావుపేటలోని శిరీషా ఫ్యాన్సీ అండ్ కంగన్ హాల్, శిరీషా గిఫ్ట్ షాపులో విజిలెన్సు అధికారులు తని ఖీలు చేపట్టారు. వస్తువులపై ఉన్న ఎంఆర్పీ ధరలపై మరో స్టిక్కర్ అంటించి అధిక ధరలతో వస్తువులను వి క్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు విజిలెన్సు డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఉన్న వస్తువులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిం చారు. గరిష్ట చిల్లర ధరలో మార్పులు, గడువు తీరిన వస్తువులు, జీఎస్టీ బిల్లుల్లో వ్యత్యాసాలున్నట్టు గుర్తించారు. దీంతో తూనికలు కొలతల చట్టం అతిక్రమించినందుకు ఎనిమిది కేసులు నమోదు చేశారు. బిల్లుల వ్యత్యాసాలు, గరిష్ట చిల్లర ధరల మార్పులు చేసినందుకు జీఎస్టీ చట్ట ప్రకారం మూడు లక్షల రూపాయల అపరాధరుసుం విధించారు. ఈ తనిఖీల్లో విజిలెన్సు డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావుతో పాటు ఏఈ టి.శ్రీనివాసరావు, ఏఈఈ ఎం.అనిల్ బాబు, ఎస్ఐ కె.సీతారామ్, జీఎస్టీ అధికారులు, డీసీటీవో కె గంగా భవానీ, ఎసీటీవో ఆర్.పద్మరాజు, తూనికలు కొలతల అధికారి వి.ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల నిర్వహణా తీరుపై డీఈవోకు ఫిర్యాదు


డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న టీఎన్‌యూఎస్ నాయకులు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : తెలుగు మీడియం విద్యార్థులను ఉర్దూ మీడియంలో చదువుతున్నట్టుగా రిజిస్టర్లలో నమోదు చేయడంపై విచారణ చేపట్టాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం డీఈవో వెంకటలక్ష్మమ్మకు జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు నెరుసు రాంబాబు, ప్రధానకార్యదర్శి బి.వి.రమణకుమారి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. తూర్పువీధిలోని ఉర్దూ పాఠశాలలో ప్రస్తుతం 30 మంది మాత్రమే విద్యార్థులుండగా, సమీపంలోని అంబేద్కర్ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి సుమారు 150మంది తెలుగు మీడియం విద్యార్థులను చేర్చుకుని ఆ సంఖ్యను పెంచి చూపిస్తున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖకు తప్పుడు సమాచారమిచ్చి ఉపాధ్యాయులను డిప్యూటేషన్లపై తెచ్చుకుని స్కూల్‌ను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి స్కూలు టీచర్లలో కేవలం నలుగురు మాత్రమే ఉర్దూ బోధించే ఉపాధ్యాయులుకాగా, మిగిలినవారంతా తెలుగు మీడియం టీచర్లేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేవలం 30 మంది లోపు ఉర్దూ విద్యార్థులుంటే పాఠశాలను హైస్కూలుగా ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. తక్షణమే అధికారిలతో విచారణ చేయించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా స్కూల్‌ను అప్‌డేట్ చేయాలని అభ్యర్థించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : చాటపర్రు సెక్షన్ కె.వి.గుడివాకలంక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తలైన్ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. ఆపరేషన్ సర్కిల్ ఇంజనీర్ కె.ఎం. అంబేద్కర్ మాట్లాడుతూ పైడిచింతపాడు, కొక్కిరాయిలంక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఉన్న చిన్న పంటబోదెలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం ఉన్నట్టు ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ సిహెచ్‌కె దుర్గా ప్రసాద్ వెంకటాపురం పంచాయతీ మాదేపల్లి రోడ్డు పక్కన సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృత దేహం లభ్యమైంది. పొడుగు చేతుల టీషర్టు, ఫ్యాంటు ధరించి ఉన్నాడని,మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్.ఐ. తెలిపారు. పది రోజుల క్రితం చనిపోయి ఉండటంతో మృత దేహం కుళ్లిపోయిందని తెలిపారు.


సారా బట్టీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

15 లీటర్ల సారా స్వాధీనం

కుక్కునూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీధర వేలేరుగ్రామంలో సారా తయారికి సిద్ధంగా ఉన్న 1200లీటర్ల పులిసిన బెల్లపుఊటను ఎక్సైజ్‌శాఖ సిబ్బంది మంగళవారం ధ్వంసంచేశారు. అలాగే 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో పట్టుబడిన ముగ్గురు వ్యక్తుల పై కేసు నమోదు చేసి జంగారెడ్డిగూడెం కోర్టు హాజరుపరచగా రిమైండ్ చేశారు. ఈ దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌భోగేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

పోలవరం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పోలవరం మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో మండలంలో అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ పాఠశాలల్లో పదవ తరగతిలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత పొందిన ముగ్గురు విద్యార్థులను మండల విద్యాశాఖాధికారి, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్ బాబు, మండల విద్యాశాఖాధికారి సురేశ్ బాబు, వ్యవసాయాధికారి కె రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

పీఎఫ్ చెక్కు అందజేత

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో సీని యర్ అసిస్టెంటుగా పని చేస్తూ పదవీ విరమణ చేసిన ఎండీ భూప్రాన్ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల 14వేల చెక్కును మేయర్ షేక్ నూర్జహాన్ అందజేశారు. నగర పాలక సంస్థలో ఎన్నో సేవలందించిన భూప్రాన్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పదవీ విరమణ చేసిన వెంటనే పీఎఫ్ సొమ్మును అందించారు. కార్యక్రమంలో కమిషనర్ భానుప్రతాప్, ఎస్ఎంఆర్ పెదబాబు, మూర్తి పాల్గొన్నారు.

గిరిజనుల బంద్‌కు సీపీఎం మద్దతు

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక డీఎస్సీ కోసం గిరిజను నిర్వహిస్తున్న ఏజెన్సీ సీపీఎం మద్దతు తెలియజేసింది. ఈ మేరకు సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మే 2న గిరిజనులు చేపట్టనున్న బంద్‌ను జయప్రదం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను మంగళవారం కోరారు.

ప్రాథమిక పాఠశాలలను కాపాడండి : ఆప్టా

పెదవేగి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వులు 117కు ప్రత్యామ్నాయంగా తీసుకొస్తున్న మార్పులతో ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందని, దీనిపై పునరాలోచన చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్ అసోసియేషన్(ఆప్టా) ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శివరామ్,ఎం.శ్రీనివాసరావులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో తీసుకొస్తున్న మార్పులపై అధ్యక్ష, కార్యదర్శులు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:30 ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిగా నిర్ణయించారన్నారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని, అలాగే ఏకోపాధ్యాయ పాఠశాలలు జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో మూతపడే ప్రమాదం లేకపోలేదన్నారు. ఈ ప్రమాదం రాకుండా ఉండాలంటే 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయుల కేటాయింపులు జరగాలన్నారు. ఆ మేరకు విద్యాశాఖ నిర్ణయం తీసుకోవాలని కోరారు.

2 నుంచి ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ముసునూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిన 25శాతం ఉచిత ప్రవేశాలకు మే 2వ తేదీ నుంచి 19వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుంచి జరగాల్సిన దరఖాస్తుల స్వీకరణ కొన్ని అనివార్య కారణాల వల్ల మే 2నుంచి ప్రారంభిస్తున్నట్లు సమగ్ర శిక్షణ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన చెప్పారు.

సారా పట్టివేత

చాట్రాయి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చనుబండలో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా విస్సన్నపేట మండలం చండ్రుపట్ల చిన తండాకు చెందిన బాణావతు ఏసు ద్విచక్రవాహనంపై రవాణా చేస్తున్న 20 లీటర్లు సారా పట్టుకున్నట్లు, నిందితుడు ఏసును అరెస్ట్ చేసి సారా, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. ఈ సారాను నీ గుడిపాడుకు చెందిన దేవమణికి అమ్ముతున్నట్లు నిందితుడు చెప్పగా ఆమెపై కూడా కేసు నమోదు చేశామన్నారు.

నేడు కాళీమాత విగ్రహ పునఃప్రతిష్ఠ

కైకలూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కైకలూరు కొరుకొల్లు రోడ్డులో కాళీమాత అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మంగళవారం ఆవాహిత, చండీ, మూలమంత్ర హోమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని ధాన్యదివాసం, హారతి, యంత్ర పుష్పం, మంత్రపుష్పం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం విగ్రహపునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ వ్యవస్థాపకులు సింహాద్రి సత్యనారాయణ, కోశేశ్వరీదేవి దంపతులు ఆహ్వానించారు.

పాలిసెట్ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

నూజివీడు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నూజివీడులో బుధవారం జరుగునున్న పాలిసెట్ పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పాలిసెట్ సెక్రటరీ జీవీ రామచంద్రరావు మంగళవారం పరిశీలించారు. నూజివీడు పట్టణంలో తొలిసారి రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో సెట్ నిర్వహణ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు పట్టణంలో మొత్తం 756 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూజివీడు పట్టణంలో మొట్టమొదటిసారి పాలిటెక్నిక్ సెట్ (ఏపీ పాలిసెట్) నిర్వహణ పట్ల సిబ్బందికి వివిధ అంశాలలో అవగాహన కల్పించారు. వేసవి నేపథ్యంలో చల్లని నీరు, ఫ్యాన్ల ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ కోఆర్డినేటర్ వీవీ కృష్ణమోహన్, రూట్ ఆఫీసర్, ఎలిషా, పరిశీలకులు అబ్దుల్ రహమాన్, సంజీవరావు, నూజివీడు పాలిటెక్నిక్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ పాఠశాలను పరిశీలిస్తున్న పాలిసెట్ అధికారులు



మంగళవారం నూజివీడులో జరిగిన ప్రాజెక్టు కమిటీ సమావేశంలో సభ్యులు

అమరావతిలో కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు

నూజివీడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు కాంపి టెంట్ అథారిటీ నాగార్జునసాగర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎమ్మార్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా సాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం నూజివీడులోని ఎడమకాలువ డివిజన్ కార్యాలయంలో కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎస్ఈ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎడమ కాలువ పరిధిలో 2వ, 3వ జోన్‌లో కాలువల నిర్వహణకు అందువలన తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళామని తెలిపారు. ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎడమకాలువ మూడోజోన్‌లోని 2.36 లక్ష ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ద్వారా గోదావరి జలాలను తీసుకువచ్చే చింతలపూడి ఎత్తి పోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎడమకాలువకు 32 టీఎంసీలు అధికార వాటా ఉన్నప్పటికి ఈ సీజన్‌లో 20 టీఎంసీలు మాత్రమే సాగునీరు తెలంగాణ నుంచి మనకు అందించినారు. మూడోజోన్ పరిధిలో బాపులపాడు మేజర్, వేంపాడు మేజర్, మాచవరం మేజర్, జక్కంపూడి మేజర్, జములాపురం మేజర్, మూలపాడు, ఇబ్రహీంపట్నం మేజర్లకు కనీసం సాగునీరు అందలేదన్నారు. 16వ ఆర్థికసంఘం నుంచి ఎడమ కాలువ ఆధునీకరణకు ప్రతిపాదించిన రూ.199 కోట్ల నిధులను మంజూరు చేయించాలని కోరారు.

కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ ఎడమకాలువ తాగు నీటి కోసం ప్రతిపాదించిన 3.75 టీఎంసీల నీటిని విడుదల చేయాలని, 2వ జోన్ సాగర్ ఎడమకాలువ స్థిరీకరణకు ఉపయోగపడే వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాన్ని త్వరగా ప్రారంభించాలన్నారు. జోన్-2 పరిధిలో ఎత్తి పోతల పథకం ద్వారా చివరి ఆయకట్టు స్థిరీకరణకు పాములూరు, వెంకటాపురం బ్రాంచ్‌ను త్వరగా నిర్మించాలని కోరారు. పలువురు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు మాట్లాడుతూ ప్రాజెక్టు కమిటీ పరిధిలోని డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో అదనపు అక్రమ ఇంజనీరింగ్ సిబ్బంది నియమించాలని కోరారు. 117వ కిలోమీటర్ రామచంద్రాపురం రెగ్యులేటర్ దగ్గర గేట్లను, ముద్దులూర్రు రెగ్యులేటర్ దగ్గర నూజివీడు, మైలవరం బ్రాంచ్ కాలువల గేట్లను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయించాలని కోరారు. గత ప్రాజెక్టు కమిటీ తీర్మాన నంలో చేసిన తీర్మానాల అమలు నివేదికను ఈ సమావేశంలో ఆమోదించారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన 15 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు, మాజీ డివిజన్ ఈఈ ఆర్.సంతోష్, జగ్గయ్య పేట డీఈ కె.కిషోర్, ఇతర అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి శాంతి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

ముదినేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - దేవపురపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వార్ల శాంతి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం కృత్తిక నక్షత్రం సందర్భంగా నిర్వహించిన ఈ కల్యాణాన్ని పలువురు దంపతులు నిర్వహించారు. ఆదేవస్థానం ఏసీ అర్‌గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, కోట శివశంకర్ శర్మ కల్యాణాన్ని జరిపించారు.

తాగునీటి చెరువుల్ని నింపుకోవాలి

కలిదిండి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా తాగునీటి చెరువులను పూర్తిగా నింపుకోవాలని ఇరిగేషన్ ఏఈఈ ఫణి కుమార్ అన్నారు. మంగళవారం సంతోషపురం, బొక్కలపాలెం, మూల్లంక తాగునీటి చెరువులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులను నీటివంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రస్తుతం సీబీ కెనాల్ నీటి మట్టం పెరుగుతుందని, తాగునీటి చెరువులను నింపే వరకు నీటివంతం వస్తుందన్నారు. జిల్లాకు శివారు న ఉన్న పెదలంక తాగునీటి చెరువును పూర్తిగా నింపటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీబీ కెనాల్‌లో నీటిమట్టం తక్కువగా ఉండటంతో లంక గ్రామాల్లో తాగునీటి చెరువులకు సరిపడ నీటి సరఫరా లేదని నీటి సంఘాల అధ్యక్షులు తెలిపారు. సీబీ కెనాల్‌కు కొరుకొల్లు లాకుల వద్ద 250 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో కలిదిండి, కొరుకొల్లు డీసీ ఛైర్మన్లు ముద్దం బోగేశ్వరావు, పేటేటి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈ కృష్ణారావు, ఆజయ్, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కైకలూరు: శివారు గ్రామాల్లో మంచినీటి చెరువులు త్వరితగతిన నింపుకోవాలని డీసీ ఛైర్మన్ పొత్తూరి వాసురాజు అన్నారు. మంగళవారం కైకలూరు మండలం దొడ్డిపట్ల, రామవరం గ్రామాల్లోని మంచినీటి చెరువులకు వెళ్లే పోలరాజ్ పంట కాలువను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డిపట్ల, రామవరం, కలిదిండి మండలం కొండూరు, కొత్త పాలెం గ్రామాల్లో పంచాయతీ అధికారులు, ఇంజనీర్లు, మోటార్లు ద్వారా త్వరితగతిన మంచినీటి చెరువులు నింపుకోవాలన్నారు. మరో రెండు రోజులు మాత్రమే కాలువలకు నీరు వస్తున్న ందున నీరు అక్రమంగా తరలిపోకుండా మంచినీటి చెరువులు నింపుకోవాలన్నారు. కార్యక్రమంలో కైకలూరు ఇన్‌ఛార్జి ఎండీవో కొండలరావు, జలవనరులశాఖ ఏఈ సురేష్, పంచాయతీ కార్యదర్శులు పి జీవన్‌కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



పెదలంక కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈఈ ఫణి కుమార్, తదితరులు

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా రాష్ట్రప్రభుత్వ అస్యూరెన్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కలిశారు. మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి నివాసంలో కలిసిన కైకలూరు నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనితో పాటు రాష్ట్రంలో చేపట్టవలసిన కార్యక్రమాలపై అస్యూరెన్స్ సిఫార్సులను పరిగణనలోనికి తీసుకోవాలని కోరారు.

యూపీ పాఠశాలల ఎత్తి వేతపై నివేదిక ఇవ్వండి

ఆంధ్రజ్యోతి వార్తపై స్పందించిన డీఈవో

ముదినేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలల ఎత్తివేతపై జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ ఆరా తీశారు. విద్యార్థులకు కొత్త చిక్కులు అన్న శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన ఆమె మండల విద్యాశాఖాధికారి నరేష్‌కుమార్‌ను వివరణ కోరారు. మండలంలోని తొమ్మిది యూపీ పాఠశాలలను రద్దు చేయడం, ఆయా పాఠశాలల విద్యార్థులు 6, 7, 8 తరగతులకు దూర ప్రాంతాల్లోని జిల్లా పరిషత్ హైస్కూళ్లకు వెళ్లేందుకు ఎదుర్కొనున్న ఇబ్బందులపై వివరంగా ప్రచురితమైన వార్తపై డీఈవో పూర్తి వివరాలను ఎంఈవోను కోరారు. దీనిపై సాయంత్రం ఎంఈవో నివేదిక పంపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ముదినేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం దేవపూడిలో మంగళవారం కైకలూరు నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను జనసేన జిల్లా కార్యదర్శి దాసరి రమేష్, సంయుక్త కార్యదర్శి వేల్పూరి నానాజీ ప్రారంభించారు. తొలి రోజు దేవపూడి, అప్పారావుపేట టీమ్‌లు పోటీపడగా అప్పారావుపేట టీమ్ విజయం సాధించింది. సుమారు 40 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. బొర్రామెంట్ల అర్జునరావు, గూడపల్లి మునెయ్య, నేతల రమేష్, మట్టపూడి వంశీ, పళ్ళెం మణికంఠ పోటీలను పర్యవేక్షించారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన సదస్సు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి మండలం, శోభనాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు మండల ట్రైనర్ శోభరాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో డీఎంఎటీ అల్లాడ్డా రాణి, జె. సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేద్దాం

చాట్రాయి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగే రాజధాని పనుల పునః ప్రారంభ సభకు నూజివీడు నియోజకవర్గం నుంచి కూటమి శ్రేణులతో పాటు ప్రజలు భాగిగా తరలివచ్చి విజయవంతం చెయ్యాలని గృహనిర్మాణమంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు మంత్రి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రధాని సభకు మన నియోజకవర్గం నుంచి 20 వేల మందిని తరలిస్తానని సీఎంకు మాట ఇచ్చానని తెలిపారు.

రూ.2.5 లక్షల ఎల్‌వోసీ పత్రం అందజేత

ఆగిరిపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామానికి చెందిన కెరంగ్యు ఆనారోగ్యంతో బాధపడుతున్నారు వారి మెరుగైన చికిత్స కోసం ఆర్థిక సహాయం కోసం కుటుంబసభ్యులు మంత్రి దృష్టికి తీసుకురాగా, చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 2.5 లక్షల రూపాయల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. మంగళవారం తెలుగుదేశం నాయకులు ఎల్‌వోసీ పత్రాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

ప్రధాని సభకు 16 బస్సుల ఏర్పాటు

ముదినేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి వచ్చేనెల 2న వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి అధికారులు కృషి చేయాలని ముదినేపల్లి ఎంపీడీవో వైఎంకృష్ణ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, ఐకేపీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలానికి 16 బస్సులను కేటాయించారని తెలిపారు.

ఉపాధి పనులు ప్రారంభం

ముదినేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం ములకలపల్లిలో ఉపాధి హామీ పనులు ప్రారం భమయ్యాయి. వివిధ కారణాలతో ఆ గ్రామంలో ప్రస్తుతం సీజన్‌లో నిలిచిపోయిన పనులను ముమ్మరంగా చేపట్టారు. 'కూలీలకు ఉపాధి కరువు' అనే శీర్షికన ఈ నెల 28న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు స్పందించిన మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో హేమంత్ కుమార్ వెంటనే పనులను చేపట్టారు. ప్రతి ఉపాధి కూలీకి వంద రోజుల పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ జాన్ ఆధ్వర్యంలో వంట బోదెల తవ్వకం పనులు జరుగుతున్నాయి.

కిక్కిస తొలగింపు పనులు



ముదినేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పేరాలిది ఎకరాలకు సాగునీరు పారుదల సౌకర్యం కల్పిస్తున్న పెద లంక మేజర్ డ్రెయిన్‌లో కిక్కిస తొలగింపు పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమయ్యాయి. కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ గత ఖరీఫ్ సీజన్‌లో ముంపు నివారణకు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ డ్రెయిన్‌లో పనులు ఏర్పాటు చేశారు. దీంతో పంటపైనే ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి డ్రెయిన్‌లోని కిక్కిసను తొలగించేందుకు అవకాశం ఏర్పడింది. ముదినేపల్లి మండలం దేవపూడి నుంచి అవకాశం వరకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరం ఈ మేజర్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన కిక్కిసను తొలగిస్తున్నారు. సుమారు రూ.17 లక్షల వ్యయంతో కిక్కిస తొలగింపు పనులు చేపట్టారు. డ్రెయినేజీ డీఈఈ ఆర్.వి.ఎస్.ఎస్.కుమార్, డీసీ ఛైర్మన్ గుడివాడ సురేష్ బాబు, ఏఈ బోగేంద్ర ప్రసాద్ కిక్కిస తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్నారు.


క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

ముదినేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామంలో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగులు నిర్వహిస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ గ్రామంలో క్రికెట్ బెట్టింగులు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు ఎస్ఐ వీవీఎస్‌వీరభద్రరావు తన సిబ్బందితో దాడి నిర్వహించి 8 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.8 వేల నగదు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు

కలిదిండి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కలిదిండి, కొరుకొల్లు గ్రంథాలయాల్లో మంగళవారం విద్యార్థులకు క్విజ్, చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారులు రమేష్ బాబు, రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు.

వీఆర్వో ఆంజనేయులుకు పదోన్నతి



కలిదిండి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెదలంక వీఆర్వో ఆంజనేయులుకు ఏలూరు కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. మంగళవారం కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతి పొందిన ఆంజనేయులుకు మండల వీఆర్వోలు అభినందనలు తెలిపారు.

టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ముసునూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బి.వి.ఎస్ సుబ్బారావు తెలిపారు. మంగళవారం రమణక్కపేట జడ్పీపాఠశాలలో ఈ తరగతులను ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఈ తరగతులు కొనసాగుతాయన్నారు. హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

వినియోగంలోకి చేతి పంపు

ముసునూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఎస్సీకాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద పాడైపోయి పనిచేయని చేతిపంపును ఆర్‌డబ్ల్యూఎస్ మెకానిక్ మంగిశెట్టి సుబ్బారావు పంపును మరమత్తు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు.

కొల్లేరులో మళ్లీ అదే సీన్



అడవికొలనులో చేపల చెరువు గట్టు కొట్టడానికి వచ్చిన ఫారెస్టు అధికారులను అడ్డుకుని నిరసన తెలియజేస్తున్న స్థానిక వరి రైతులు

అడవికొలనులో చెరువుకు గండి కొట్టేందుకు ఫారెస్టు అధికారుల ప్రయత్నం

అడ్డుకున్న స్థానిక రైతులు

పొలాలన్నీ మునిగిపోతాయని ఆవేదన

నిడమర్రు ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు ఆపరేషన్ రచ్చ పరిధిలో గల చెరువులకు గండ్లు వివాదం ఫారెస్టు అధికారులకు స్థానిక వరి రైతులకు మధ్య బాహ్ టామ్ అండ్ జెర్రీ గేమ్‌లా జరిగింది. మొన్న నిడమర్రు గ్రామ శివారులో జిరాయితీ భూమిలో గల చేపలచెరువు గట్టును కొట్టివేసే యెందుకే సమీపంలోని వరిచేలు మునిగిపోయాయి. చేసిన తప్పును సరిదిద్దుకోవడం కోసం ఫారెస్టు అధికారులు ఇంజన్లు పురమాయించి చేలల్లో నీళ్లు తోడే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం ఆడవికొలను శివారులో మరో చెరువుకు గండ్లు కొట్టేందుకు ప్రయత్నాలు చేయడం మొదలు పెట్టగా సమీపంలో వరి రైతులు అందోళన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు రైతులు పక్షాన నిలబడడంతో అక్కడకు అది ఆగింది. ఫారెస్టు అధికారుల ఈ చెరువుకు గండి పెట్టినట్లయితే ఈ ఆయకట్టులో గల సుమారు 40 ఎకరాల వరిపొలాలు మొత్తం నీటిపాలవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో ఇలా రైతులను భయభ్రాంతులను చేయడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులు స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దృష్టికి విషయం తీసుకువెళ్ళగా ఆయన రైతులతో కలసి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఫోన్‌లో ఆశ్రయించి తీసుకొని సాయంత్రం ఏలూరులో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.

● వాయిదా వేయాలి



కొల్లేరులో 10 ఎకరాలు వరి సాగు చేస్తున్నా. ఇప్పటికే సుమారు 6 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాను. ఫారెస్టు అధికారులు రైతులు పై పగబట్టినట్టు వ్యవహరిస్తున్నారు. 110 ఎకరాల చెరువు గండిపెడితే మా పొలాల్లో మోకాలు పైనే నీరు పడిపోతుంది. దీంతో చేను ఎందుకు పనికిరాకుండా పోతుంది. అధికారులు చెరువు లకు గండ్లు పెట్టే పనిని వాయిదా వేయాలని కోరుతున్నాం. లేకపోతే తీవ్రంగా నష్టపోతాం

-కోటిపల్లి రాధాకృష్ణ, రైతు అడవికొలను

● గండి పెడితే పంటంతా పోయేది



నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఆరుగాలం కష్టించి పండించుకున్న పంట కోతకు వచ్చే సమయంలో ఫారెస్టు అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా చెరువు లకు గండ్లు పెట్టడానికి ప్రయత్నించారు. పెద్ద చెరువుకు గండ్లు పెడితే మా పొలం అంతా నీట మునిగి కోతకు పనికి రాకుండా పోతుంది. ఫారెస్టు అధికారుల చర్యలను ప్రతిఘటించాల్సి వచ్చింది

- పాల సత్యనారాయణ, రైతు అడవికొలను

● గండి పెడితే చేలన్నీ కొల్లేరే



అడవికొలను తీరంలో ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకొని బతుకుతున్నాం. మా తాతల కాలం నుంచి ద్వాళ్వా సాగు చేస్తున్నాం. ఫారెస్టు అధికారులు అక్కా చెరువులపై కక్షతో గండ్లు కొట్టడం వల్ల మా పొలాలు పూర్తి దెబ్బతినే ప్రమాదం ఉంది. మా పొలాలను రక్షించాలని స్థానిక ప్రజా ప్రతి నిధు లను, అధికారులను వేడుకుంటున్నాం.

-పమ్మి గోవింద్, రైతు

వివాదాస్పద చేపల చెరువు సర్వే

మూడు రోజులుగా వివాదాల్లో చిక్కుకున్న కొల్లేరు అభయారణ్యం సమీపంలో గల జిరాయితీ భూమిలో గల చేపల చెరువులో ఎట్టకేలకు సర్వే ప్రారంభమైంది. మంగళవారం ఉదయం రైతు వర్మాల సుబ్బారావు, పలువురు చేసుకున్న దరఖాస్తు మేరకు రెవెన్యూ అధికారులు ఆర్ఎస్ నెం 433 -1,2,3,4 లో గల 6.24 ఎకరాల భూమిలో సర్వే చేపట్టారు. సరిహద్దులో గల భీమడోలు, నిడమర్రు మండలాల సరిహద్దులు కూడా నిర్ధయం జరుగుతుందని దున ఇరు మండలాల రెవెన్యూ అధికారులు, సర్వేయర్ల సమక్షంలో సర్వే ప్రారంభించారు. భీమడోలు మండలం చెట్టున్నపాడు గ్రామ రెవెన్యూ సిబ్బంది, నిడమర్రు మండలం వెంకటాపురం గ్రామ రెవెన్యూ కాంటారు సరిహద్దులను ప్రామాణికంగా పరిశీలించారు. కోర్టు కేసుల వల్ల పారెస్టు అధికారులు హాజరు కాలేక పోయారని రెవెన్యూ అధికారులు కు తెలియజేయడంతో సర్వే వాయిదా వేశారు. ఫారెస్టు అధికారులు లను సంప్రదించి త్వరలో సర్వే తేదీని నిర్ణయిస్తామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు.


చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

నూజివీడు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు శిక్ష విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పూరి కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం టి నరసాపురం మండలం వెలగలపల్లికి చెందిన చింతపల్లి చక్రసాయి రాంబాబుకు 6 నెలలు జైలు శిక్ష రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. 2018లో బాపులపాడు మండలం మడిచర్లకు చెందిన తలకొండ గోపాలకృష్ణ చక్రసాయి రాంబాబుకు రెండు లక్షల రూపాయలు నగదును అప్పుగా ఇచ్చారు. బాకీ తీర్మానం నిమిత్తం చెక్కును ఇవ్వగా ఆ చెక్కు బ్యాంకులో నగదు లేదని తిరిగి వచ్చింది. దీంతో గోపాలకృష్ణ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడు చక్రసాయి రాంబాబుకు శిక్ష విధించారు.

నకిలీ కుల ధ్రువ పత్రంతో అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం

కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులానికి చెందిన ఒక మహిళ ఎస్సీ ధ్రువపత్రంతో అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం చేస్తున్నదని, అర్హత కలిగిన ఎస్సీ కులానికి చెందిన తనకు అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ బాధిత మహిళ జిల్లా కలెక్టరును కలిసి ఫిర్యాదు చేసింది. కలిదిండి మండలం పెదలంక శివారు కుదు చెందిన చాబత్తిన బేబీ రాజేశ్వరి 2020లో ఎస్సీ కోటాలో కైకలూరు ఐసీడీఎస్ పరిధిలో కోట నెంబర్ 618లో అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు ప్రకటన వెలువడింది అన్నారు. దీంతో అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు తాను దరఖాస్తు చేసుకోగా ఇదే పోస్టుకు యార్ల రామమణి దరఖాస్తు చేసుకుందని తెలిపారు. అప్పటి ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నాయకుల పైరవీలు చేసి బీసీ కులానికి చెందిన యార్ల రామమణికి పోస్ట్ కేటాయింపు జరిగిందని తెలిపారు. ఈ విషయంపై ఐసీడీఎస్ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అప్పట్లో పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో తాను హైకోర్టును ఆశ్రయించగా రామమణి కుల ధ్రువపత్రంపై విచారణ చేయాలని ఆదేశించినా హైకోర్టు ఆదేశాలు సైతం పట్టించుకోలేదని తెలిపింది. తన పిర్యాదుపై విచారణ చేసి అంగన్‌వాడీ టీచర్ పోస్టు తనకు కేటాయించాలని కలెక్టరు విజ్ఞప్తి చేశారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475